Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 22.05.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 51 పేజీలు : 12, వెల : ₹ 5


Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# సమర్థతకు స్థానం

## ● గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా సోమిరెడ్డి ● జిల్లా దేశం కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు

పిలిస్తే పలికే నాయకుడికి, సమస్య చెబితే పరిష్కరించే లీడర్‌కు, పనిచెబితే పరుగెత్తుకొచ్చే సమర్ధుడికి ఎమ్మెల్సీ వస్తే బాగుండునని ఇంతకాలం నెల్లూరుజిల్లాలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆశపడుతూ వచ్చారు. ఎట్టకేలకు కార్యకర్తల ఆశలు ఫలించాయి. జిల్లా తెలుగుదేశంపార్టీలో అందరికీ తలలో నాలుకలా ఉంటూ అందరి మనిషిగా పేరుగాంచిన తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గవర్నర్ కోటాలో శాసనమండలి పదవి వరించబోతుంది.

ఈమేరకు ఈ నెల 20వ తేదీన జరిగిన పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలోని తెలుగుదేశం కార్యకర్తలు ఆనందోత్సాహాలలో మునిగిపోయారు. సోమిరెడ్డిని ఎమ్మెల్సీ (మిగతా 11వ పేజీలో)

# పదిలో ప్రతిభా'రత్నం'



2లో



2లో

# 'వంశీరామ్'కు విశిష్ఠ గుర్తింపు


సల్వార్ ఉత్సవ్..
FLAT 50% తగ్గింపు FLAT 20% తగ్గింపు
సల్వార్స్, డ్రస్ మెటీరియల్స్, లేడీస్ వెస్ట్రన్‌వేర్‌పై..
కళానికేతన్® షాపింగ్ మాల్
ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్:2316677



ఏడాదిలో...

# ఏం సాధించారు?

అయిదేళ్ల పాలనా కాలంలో ఏడాది గడిచిపోయింది. ఒక్క సంవత్సరం అంత ఎక్కువ టైం కాదు సంపూర్ణ ఫలితాలు చూపించడానికి. అలాగని తక్కువ టైమూ కాదు ఏ ఫలితాలు చూపించకుండా పోవడానికి! ఏడాది పాలనలో ఒక మార్గం ఏర్పడి ఉండాలి. ప్రభుత్వాల పనితీరు దాదాపుగా అర్ధమైపోవాలి.

కేంద్రంలో ఎన్డీఏ, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వాల పాలనకు ఏడాది పూర్తి కావస్తుంది. ప్రధానిగా నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు మొన్న ప్రమాణస్వీకారం చేసినట్లుంది. గిర్రున అప్పుడే ఏడాది కాలం కరిగిపోయింది.

దేశ ప్రజలు ఎన్నో ఆశలతో నరేంద్ర మోడీ మీద నమ్మకంతో ఎన్డీఏను అధికారంలోకి తెచ్చారు. అంతకుముందు కాంగ్రెస్ పాలన మీద వ్యతిరేకత వెల్లువెత్తింది. అది మోడీ మీద నమ్మకంగా మారింది. దేశాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళతానని చెప్పిన మోడీ మాటలను ప్రజలు నమ్మారు.

ఆరోజున్న పరిస్థితుల్లో మోడీని (మిగతా 2వ పేజీలో)




# వంశీరామ్‌కు విశిష్ట గుర్తింపు

## అవార్డుతో సత్కారం




నెల్లూరీయుడు, యువకుడు, ఉత్సాహవంతుడు, అతిచిన్న వయస్సులోనే నాణ్యతా ప్రమాణాలు కలిగిన భవన నిర్మాతగా నిర్మాణ రంగంలో గుర్తింపు సాధించి హైదరాబాద్‌లో సంచల నాలకు సారధిగా నిలిచిన పార్లపల్లి వాసి బద్వేలు సుబ్బారెడ్డి మరో ప్రతిష్ఠాత్మక అవార్డును ఇటీవల అందుకున్నారు.

అపార్ట్‌మెంట్ రంగంలో ముఖ్యంగా లగ్జరీ ఫ్లాట్‌ల రూప కల్పనలో వంశీరామ్ బిల్డర్స్ పాటిస్తున్న అధునాతన విధానాలు ఆకర్షణీయమైన డిజైన్ల రూపకల్పన వంటి అంశాలకుగాను 'బిజినెస్ లీడర్-2015' అవార్డుతో సంస్థ ఛైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బారెడ్డిని టివి5 వారు సత్కరించారు.

దాదాపు ఒకటిన్నర దశాబ్దానికి పైగా నిర్మాణ రంగంలో ఎన్నో విజయాలను సాధిస్తూ అటు గృహనిర్మాణంలోనూ ఇటు వ్యాపార సముదాయాలలోనూ ఇప్పటివరకు 60కిపైగా భారీ నిర్మాణాలను చేపట్టడమే కాకుండా, ప్రస్తుతం మరో 14ప్రాజెక్టు లను శరవేగంగా పూర్తి చేసుకుంటున్న సంస్థ వంశీరామ్ బిల్డర్స్. గతంలో అనేక సందర్భాలలో జాతీయ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ పలు పురస్కారాలు, సత్కారాలు అందుకున్న ఈ సంస్థకి ఈసారి డీలక్స్ అపార్ట్‌మెంట్స్ రూపకల్పన ద్వారా లగ్జరీ విభాగంలో చేస్తున్న కొత్త ప్రయోగాలతో తమ ఖాతాదారులను సంతృప్తి పరుస్తున్నందుకుగాను ఈ అవార్డు లభించింది.

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్య నాయుడు, తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటిఆర్ చేతుల మీదుగా ఈ 'బిజినెస్ లీడర్' అవార్డును వంశీరామ్ సుబ్బారెడ్డికి టివి5 అధినేత రవీంద్ర నాథ్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మరో కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.ఇ.కృష్ణమూర్తి, సినీనటుడు అక్కినేని నాగార్జునతో సహా పలువురు ఆంధ్ర, తెలంగాణకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. తమ తమ రంగాలలో ఉత్తమ సేవలందించి, తమకి తమ సంస్థలకీ విశేష గుర్తింపును తెచ్చుకున్న చాలామంది ప్రముఖులను టివి5 ఈ అవార్డులకు ఎంపిక చేసింది.

యావత్ భారతదేశంలో అగ్రగామిగా వున్న టాటా సంస్థల అధినేత రతన్ టాటాకి జీవిత సాఫల్య పురస్కారాన్ని, ప్రముఖ సినీనటుడు నాగార్జునకి 'బెస్ట్ ఎంటర్‌టైనర్' అవార్డుని, జియంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావుకి ఆంధ్రప్రదేశ్ నుండి జీవిత సాఫల్య పురస్కారాన్ని, మార్గదర్శి చిట్స్ యం.డి శైలజాకిరణ్‌కి 'బెస్ట్ లేడీ ఎంట్రపెన్యూర్' అవార్డుని ఈ కార్యక్రమంలో అందించారు.

తన ప్రతిభా నైపుణ్యం ద్వారా సమర్ధవంతమైన సారధిగా గుర్తింపు పొందుతూ నెల్లూరీయుల సత్తా చాటుతున్న బద్వేలు సుబ్బారెడ్డికి 'లాయర్' అభినందనలు.







# పదిలో ప్రతిభా'రత్నం'



జూనియర్ కాలేజీ ప్రారంభించిన వేళావిశేషం "రత్నం" స్కూల్స్‌కి బాగా కలి సొచ్చింది. ఈ యేడాది జరిగిన 10వ తరగతి పరీక్షల్లో 'రత్నం' స్కూల్స్ అత్యుత్తమ ఫలితాల ప్రభంజనాన్ని సృష్టించాయి. నెల్లూరుజిల్లా విద్యార్థి ప్రపంచానికి వారి బంగారు భవిష్యత్తే ధ్యేయంగా అంకితభావంతో అకుంఠిత దీక్షతో పనిచేసే అధ్యాపక సిబ్బందిని నియమించి 'రత్నం' విద్యాసంస్థలను తీర్చిదిద్దుతున్నారు 'రత్నం' సంస్థల సారథులు. వ్యవస్థాపకులు కె.వి.రత్నం గారితో సహా వారి కుమారులు వేణుగోపాల్, కిషోర్‌లతో పాటు రమా, వాసంతిలు కూడా పూర్తి స్థాయిలో విద్యారంగానికే తమ సమయాన్ని కేటాయిస్తూ ఓ కుటుంబ వ్యవస్థలా సంస్థలలో ఎక్కడా నాణ్యత లోపించకుండా ఫలితాల సాధనలో వెనుకంజ వేయకుండా విజయాలు సాధిస్తున్నారు.

ఒక్క క్షణం కూడా తమ దృష్టిని వేరేవైపు మరల్చకుండా ఘనమైన ఫలితాలే లక్ష్యంగా ఈ కుటుంబం చేస్తున్న సాధన ఫలితమే ఈ ఫలితాలు.

ఈ నెల 20వ తేది విడుదలైన ఎస్ఎస్‌సి ఫలితాల్లో నెల్లూరులోని రత్నం స్కూల్స్ విద్యార్థులు జిపిఏ 10/10 ర్యాంకును 48 మంది విద్యార్థులు సాధించి ప్రభంజనం సృష్టించారు. జిపిఏ 9.8/10 ర్యాంకును 61 మంది సాధించగా, 9.7/10 ర్యాంకును 72 మంది, 9.5/10 ర్యాంకును 84 మంది, 9.3/10 ర్యాంకును 80 మంది, 9.2/10 ర్యాంకును 81 మంది సాధించగా, 9.0 పైగా ర్యాంకును 612 మంది విద్యార్థులు సాధించారని, మొత్తమ్మీద 99% ఉత్తీర్ణతతో ఘనవిజయం సాధించారు.

పై ఫలితాలు ప్రకటించే సందర్భంగా రత్నం జూనియర్ కాలేజీలో జరిగిన విలేకరుల సమావేశంలో సంస్థ వ్యవస్థాపకులు "రత్నం" మాష్టారు మాట్లాడుతూ తమ విద్యార్థుల కష్టం, తమ సిబ్బంది దీక్ష ఫలించిందని, తాము అనుకున్న స్థాయిలో పదవ తరగతి ఫలితాలు సాధించగలిగామని అన్నారు.

కేజి టు పిజి లక్ష్యంగా ఈ యేడాది జిల్లాలోనే తొలిసారిగా అత్యాధునిక వసతీ సదుపాయాలతో అడ్వాన్స్ టెక్నాలజీతో "రత్నం జూనియర్ కళాశాల"ను ప్రారంభిస్తున్నట్లు రత్నం మాష్టారు తెలిపారు. గత 3 దశాబ్దాలుగా 'రత్నం' ఒక బ్రాండ్‌గా విద్యార్థి లోకాన్ని అలరిస్తుందని, అదే స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ సంస్థలపై గట్టి నమ్మకంతో ఉత్తమ ఫలితాల భరోసాతో తమ బిడ్డలను 'రత్నం'లో చేర్చి రత్నాలుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ సందర్భంగా "రత్నం కాలేజీల" ఫిజిక్స్ హెచ్ఓడి కోరా సారుతో కలిసి విద్యార్థులను రత్నం పాఠశాలల సిబ్బందిని అభినందించారు.

చిన్నారులను రత్నాల్లా తీర్చిదిద్ది భావిభారత పౌరులుగా సమాజానికి అందిస్తున్న "రత్నం" మాష్టారుకు, వారికి సహకరిస్తున్న వారి కుటుంబసభ్యులకు అధ్యాపక బృందానికి 'లాయర్' శుభాకాంక్షలు.

# మంత్రి వద్ద మాటలు తప్ప... చేతలు లేవు!

## - నగర ఎమ్మెల్యే అనిల్



రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణ మాటల మాంత్రికుడిగా కాకుండా చేతల మంత్రిగా ఉండాలని నెల్లూరునగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం నెల్లూరు నగరంలోని 15వ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఒకరు కేంద్రమంత్రిగా వెంకయ్య నాయుడు, మరొకరు రాష్ట్రమంత్రిగా నారాయణ ఉన్నా నెల్లూరుకు ఏ ఒక్క అభివృద్ధి చేసింది లేదని విమర్శించారు. గతంలో కమిషనర్ చక్రధర్‌బాబు ఉన్న సమయంలో ప్రణాళికా బద్ధంగా నగరంలో కాలువల పూడికతీత ఉండేదన్నారు. ఆయన బదిలీపై వెళ్లిన తర్వాత ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వున్న జాయింట్ కలెక్టర్ కార్పొరేషన్‌పై ఎక్కువ సమయం కేటా యించలేకపోతున్నార న్నారు. కార్పొరేషన్ అధికారులు మాత్రం ఎక్కడ భవంతులు కడుతుంటే అక్కడ వారిని బెదిరించి దండుకోవడం తప్ప ప్రజ లకు చేసింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఊటు కూరు మాధవయ్య, ఓబిలి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కరెంటోళ్ళకే షాకిచ్చాడు

మన ప్రభుత్వశాఖల పనితీరు ఏ విధంగా ఉంటుందో అందరికీ తెలిసిందే! ప్రజలకు జవాబు ఉండదు. ఒకసారి అడిగితే మామూలుగా సమాధానం చెబుతారు. రెండోసారి అడిగితే కసురుకుంటారు. మూడోసారి అడిగితే గెటౌట్ అంటారు. ప్రభుత్వ శాఖల పనితీరు తెలిసే చాలామంది ఈ ఉద్యోగులింతేలే అని సరిపెట్టుకుంటుంటారు. కాని కొడవలూరు మండలం నార్త్‌రాజుపాలెంకు చెందిన పల్లా సుబ్బయ్య అనే వృద్ధుడు అలా ఊరకుండిపోలేదు. తనకు న్యాయం జరిగే వరకు పోరాడి చివరకు సాధించాడు. సుబ్బయ్యకు వింజమూరు మండలంలో కొంత పొలం వుంది. దీనిలో విద్యుత్ కనెక్షన్‌కు గాను 6వేల రూపాయలకు రెండు డిడిలు తీసి 2005 ఫిబ్రవరిలో దరఖాస్తు చేసు కున్నాడు. అయితే ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వలన ఈ డిడిలు వారి రికార్డుల్లో నమోదు కాలేదు. సుబ్బయ్యకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. ట్రాన్స్‌కో అధికారుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిన సుబ్బయ్య 2014లో నెల్లూరుజిల్లా వినియోదారుల ఫోరంలో ట్రాన్స్‌కోపై కేసు వేసాడు. అన్నింటిని విచారించిన ఫోరం అధ్యక్షులు పి.వి.నరసింహమూర్తి, సభ్యులు ఎం.సుబ్బారాయుడులు ఈ నెల 7వ తేదీన సుబ్బయ్యకు జరిగిన నష్టానికిగాను 20వేలు నష్టపరిహారం, 5వేలు కోర్టు ఫీజలు ఖర్చు చెల్లిస్తూ అతనికి వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు.

# ఏం సాధించారు?

(మొదటిపేజీ తరువాయి)

నమ్మకపోయినా కాంగ్రెస్ మీద వ్యతిరేక తతో ప్రజలు బీజేపీకే ఓట్లేసి ఉండేవాళ్ళు.

ప్రధానిగా మోడీ ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్నాడు. మోడీ అద్భుతాలు చేస్తాడనుకున్నామని, ఆయన ఏమీ చేయ లేకపోతున్నాడని అప్పుడే చాలామంది పెదవి విరుస్తున్నారు. మోడీ మెజీషియన్ కాదు అద్భుతాలు సృష్టించడానికి, ఏడాది లోనే దేశంలోకి బుల్లెట్ ట్రైన్‌లు చొచ్చుకు రావు. దేశంలోని నగరాలన్నీ టోక్యో, సింగ పూర్, న్యూయార్క్, బీజింగ్‌లు లాగా తయారు కావు. కాని భవిష్యత్ ప్రణాళిక లకు ఎటువంటి బాటలు వేసుకున్నాడన్నదే ముఖ్యం. విదేశాంగ విధానంలో మోడీ పనితీరు భేషుగ్గా వుంది. ఏడాదిలోనే 18దేశాలు పర్యటించాడు. అందులో ముఖ్యమైన దేశాలన్నింటితో దౌత్య సంబం ధాలను బలోపేతం చేసాడు. స్వదేశంలో వస్తూత్పత్తికి పెద్దపీట వేస్తూ శ్రీకారం చుట్టిన 'మేకిన్ ఇండియా'కు రూపకల్పన చేసారు. పలు విదేశీ కంపెనీలను ఆక ర్షించగలిగారు. స్విస్‌బ్యాంకుల్లో వున్న నల్లధనంను ఇంకా తేలేకపోయినా దేశంలో నల్లధనాన్ని అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాల దిశగా సాగుతున్నాయి. ముఖ్యంగా సబ్సిడీలకు భారీగా కోత వేసారు. నరేంద్ర మోడీ క్షణం తీరిక లేకుండా పనిచేస్తున్నారు. ఇది వాస్తవమే. అయితే ఆయన మంత్రివర్గ సభ్యులు అంత చురుగ్గా కదలడం లేదు. జనం ఆశలు కొండంతలా వున్నాయి. మోడీ ప్రభుత్వం సాధిస్తున్న ఫలితాలు ఇంకా అంచనాలను అందుకోవడం లేదు. అయితే మోడీ పరిపాలనా ట్రాక్ కరెక్ట్‌గా వుంది కాబట్టి ఈరోజు కాకున్నా రేపయినా అభివృద్ధి మార్గం పట్టగలమనే నమ్మకముంది.

కానీ ఈ నమ్మకం రాష్ట్రంలో ఏడాది పాలన పూర్తి కావస్తున్న చంద్రబాబు మీద లేదు. ఎందుకంటే ఆయన పరిపాలన కోసం వేసుకున్న ట్రాక్ అటువంటింది. రాజకీయ ప్రయోజనాలు, వర్గప్రయోజ నాలకు తప్పితే, ఈ ప్రభుత్వం ప్రజాప్రయో జనాలకు పెద్దగా ప్రాధాన్యతనివ్వడం లేదు. విభజన మూలంగా రాష్ట్రం అసలే అప్పుల్లో పడింది. ఈ దశలో ముఖ్య మంత్రి రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబెట్టే పనులు చేయాలి. కానీ చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత దివాళా తీయించే పనులు పెట్టుకున్నారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలన్నీ ఫెయిలే. వ్యవసాయ భూముల్లో రాజధాని పెట్టి వ్యతిరేకత తెచ్చుకున్నాడు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా కొత్తగా పట్టిసీమ పెట్టుకుని విమర్శల పాలయ్యాడు. ఆర్థిక వ్యవస్థ అంతంత మాత్రంగా ఉంటే ఆడంబ రాలకు ఎక్కువ డబ్బు తగలేస్తున్నాడు. ప్రజల్లో ఏడాదిలోనే చంద్రబాబు పాలన పట్ల వ్యతిరేకత పెరిగింది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే తపన కంటే ఈ ఐదేళ్లలో అన్ని విధాలా ఏ విధంగా స్థిర పడాలన్నదానిపైనే చంద్రబాబు పాలన సాగుతున్నట్లుగా వుంది. ఆయన పరి పాలనా విధానం సరైన మార్గంలో లేదు. కాబట్టి ఏడాదికేడాది పరిపాలన దిగజారిపోవడం తప్ప మెరుగుపడడ మన్నది ఉండడం లేదు. మెరుగుపడే అవకాశం కూడా కనిపించడం లేదు.

# చిరస్మరణీయుడు ఓబులరెడ్డి





పారిశ్రామికంగా నెల్లూరుజిల్లాను ప్రపంచస్థాయిలో పరిచయం చేసేలా నిప్పో బ్యాటరీ తయారీ పరిశ్రమను నెల్లూరు మరియు తడలలో నెలకొల్పిన పొట్టిపాటి ఓబులరెడ్డి కాంశ్య విగ్రహాన్ని వారి కుమారుడు, నిప్పో మేనేజింగ్ డైరెక్టర్ పొట్టిపాటి ద్వారకానాథ్‌రెడ్డి బుధవారం తడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తడ కండ్రిగవాసుల దాహార్తిని తీర్చే విధంగా మంచినీటి ప్లాంటును కూడా ఆయన ప్రారంభించారు.

ఇండోనేషనల్ లిమిటెడ్ సంస్థ ద్వారా వేలాదిమందికి ఉపాధి కల్పించే కర్మాగారానికి ఓబుళరెడ్డి గారు బలమైన పునాది వేసి దాదాపు 4దశాబ్దాల క్రితమే నెల్లూరు జిల్లాను ప్రపంచ పారిశ్రామిక పటంలో చూపించారు.

కార్మికుల సంక్షేమంతో పాటు ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యాలను కూడా ఓబుళరెడ్డి ఎంతో శ్రద్ధతో చూసే వారని, అందులో భాగంగానే తమ స్వంత నిధులతో ఆసుపత్రిని నిర్మించి ప్రభుత్వానికి అందజేశారని, ప్రజల పట్ల ముఖ్యంగా పేదవారి పట్ల ఓబుళరెడ్డి గారికున్న అభిమానానికి ఈ ఆసుపత్రి నిర్మాణమే పెద్ద ఉదాహరణని ఆయన కుమారుడు ద్వారకానాథ్‌రెడ్డి అన్నారు. ఆయన స్ఫూర్తితోనే ఇప్పుడు తడ కండ్రిగ ప్రాంతంలో మంచినీటిని అందించాలనే సంకల్పంతో 20లక్షల రూపాయలు ఖర్చుతో ఆర్ఓ ప్లాంటును నెలకొల్పినట్లు ద్వారకనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిప్పో ఫైనాన్స్ ప్రెసిడెంట్ శంకర్‌రెడ్డి, డిజిఎం మోహన్‌రామిరెడ్డి, జి.యం మునిరాముడు, వి.మధుసూధనరెడ్డి, చెన్నై నుండి వచ్చిన నిప్పో ప్రతినిధులు పాల్గొన్నారు.

తండ్రి ఆశయబాటలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ద్వారకనాథ్‌రెడ్డి గారికి 'లాయర్' అభినందనలు.




### ప్రకాశం ఎమ్మెల్సీ అభ్యర్థిగా

# మాగుంట శీనయ్య

గవర్నర్, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులతో పాటు స్థానిక సంస్థల శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థుల జాబితాను కూడా చంద్రబాబు దాదాపు ఓకే చేసాడు. త్వరలో ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి నియోజకవర్గానికి కూడా ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరును ఖరారు చేశారు. ఈ నియోజకవర్గానికి ఎన్నికలంటే ఖర్చుతో కూడుకున్న పని. జడ్పీటీసీలు, ఎంపిటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, స్థానిక సంస్థల సభ్యులంతా ఓటర్లుగా ఉంటారు. కాబట్టి ఓటు ఖరీదు బాగానే ఉంటుంది. ప్రతిపక్ష పార్టీ సభ్యులనే కాదు, సొంత పార్టీ సభ్యులను కూడా కొనాల్సి వస్తుంది. అదీగాక ప్రకాశం జిల్లాలో తెలుగుదేశం, వైకాపా బలబలాలు సమానంగా ఉన్నాయి. కాబట్టి మాగుంటకు చేతిచిలుం బాగానే వదులుతుంది. అయినా మూడుసార్లు ఎంపీగా గెలిచిన మాగుంట శీనయ్య ఎమ్మెల్సీ స్థాయికి దిగిరావడం మాగుంట అభిమానులకు నచ్చడం లేదు. కాంగ్రెస్‌లో పులుల్లాగా బతికినవాళ్లు చంద్రబాబు వద్ద పిల్లుల్లా అవుతారన్నది నిజమే కాబోలు.

# విద్యార్థులకు బ్రహ్మయ్య కాలేజీ వరాలు

కొడవలూరు మండలం నార్త్‌రాజుపాలెంలోని బ్రహ్మయ్య ఇంజనీరింగ్ కాలేజీలో చేరే విద్యార్థుల కోసం ఈ ఏడాది మంచి ఆఫర్లు ఇచ్చారు. ఇంటర్మీడియట్‌లో 900కుపైగా మార్కులు వచ్చిన విద్యార్థులకు ఈ కాలేజీలో హాస్టల్ వసతి నాలు గేళ్లు ఉచితంగా ఇవ్వనున్నారు. అలాగే 4ఏళ్లు బస్సు సౌకర్యం కూడా ఉచితం. ఎంసెట్‌లో ర్యాంకు వచ్చి ఫీజు రీయంబర్స్‌మెంట్ గల విద్యార్థులకు జెఎన్‌టియు ఫీజు కాని మరేవిధమైన ఫీజులు లేకుండా నేరుగా కాలేజీలో చేరవచ్చు. హాస్టల్‌లో వుండే విద్యార్థులకు ఏడాదికి 25వేలు మాత్రమే వసూలు చేయనున్నారు. అలాగే కాలేజీ బస్సులు తిరిగే మార్గాలలో ఏ రూటులోనైనా 6వేల రూపాయల బస్సు ఫీజు మాత్రమే తీసుకుంటామని, కాలేజీలో చేరాలనుకున్న విద్యార్థులు నేరుగా మేనేజమెంట్‌ను సంప్రదించి ఈ రాయితీలు పొందాలని కాలేజీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

# 'ప్రభా'తం

స్నేహబంధం ఎంతో మధురమైనది. అందుకే స్నేహానికి సర్వత్రా ఎంతో ప్రాధాన్యత వుంది. అందులోనూ, రెండు దేశాల మధ్య స్నేహబంధం ఒక ఆత్మీయానుబంధంగా, మరింత బలోపేతం కావడం ఎంతైనా హర్షింపదగ్గది. ఏదో మనసు కష్టంతో ఏళ్ళ తరబడి దూరంగా వుండి బాధపడేకన్నా, ఎప్పుడో ఒక రోజున మనసు విప్పి మాట్లాడుకుంటే అన్ని కలతలూ తీరిపోతాయి.

చైనా-భారత్‌ల విషయంలో ఇప్పుడు జరుగుతున్నదదే. ఎంతటి జటిలమైన సమస్యనైనా పరిష్కరించేందుకు సౌహార్ద్రపూరితమైన వాతావరణంలో జరిగే చర్చలు, మనసు విప్పి మాట్లాడుకునే మాటలు ఎంతో ఉపయోగపడతాయనేందుకు భారత ప్రధాని నరేంద్రమోడీ చైనా పర్యటన ఒక తాజా ఉదాహరణ. ఇటీవల చైనాలో భారత ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా, ఇరు దేశాలకు సంబంధించి ఎన్నో కీలకమైన చర్చలు జరిగాయి. ముఖ్యంగా, ఎంతో కాలంగా ఎటూ తేలకుండా వున్న సరిహద్దు వివాదాల సమస్యలపై చర్చించుకుని అటు చైనా, ఇటు భారత్ ఎట్టకేలకు ఒక సదవగాహనకు రావడం ఎంతైనా శుభ పరిణామం. చైనాతో ఏళ్ళ తరబడిగా సరిహద్దు వివాదాల సమస్యలున్నప్పటికీ, ప్రధాని నరేంద్రమోడీ వాటన్నిటినీ పక్కన పెట్టి, ఎంతో సంయమనంతో చైనాతో చెలిమికి బాటలు వేస్తూ స్నేహహస్తం అందించడం, చైనా అధినాయకులతో సుదీర్ఘ చర్చలు జరపడం ముదావహం. అదేవిధంగా చైనా అధినేతలు కూడా భారత్‌తో పలు అంశాల పట్ల ఏకీభావంతో స్పందించడం ఎంతైనా సంతోషించదగ్గ అంశం. అన్నిటికంటే ప్రధానంగా, సరిహద్దు సమస్యలకు సంబంధించి బీజింగ్‌లో చైనా ప్రధాని లీ కెకియాంగ్, భారత్ ప్రధాని నరేంద్ర మోడీ స్నేహపూర్వక వాతావరణంలో గంటన్నరకు పైగానే చర్చించుకోవడం హర్షదాయకం. ఆ సమస్యలు ఇప్పటికిప్పుడు తీరకపోవచ్చుకానీ, సరిహద్దుల్లో ఇప్పుడు శాంతిపూర్వక వాతావరణం ఏర్పడడానికి మార్గం సుగమమవుతుందని భావించవచ్చు. సరిహద్దులో శాంతి స్థాపన ద్వారానే అభివృద్ధి సాధించగలమని ఇరు దేశాధీశులూ ఈ చర్చల్లో ఒక అభిప్రాయానికి రావడం మంచి పరిణామమే.

అంతేకాదు, చైనాతో అనుబంధానికి సరిహద్దు వివాదాలు అవరోధం కాదని ప్రధాని మోడీ తన అభిప్రాయాన్ని స్పష్టం చేయడం, సంక్లిష్టంగా మారిన బంధాలను తిరిగి పరిపుష్టం చేసుకునేందుకు ఆ దిశగా చైనా తన ఆలోచనా దృక్పథాన్ని పునఃపరిశీలించుకోవాలని, అరుణాచల్‌ప్రదేశ్‌వాసులకు ప్రత్యేక వీసాలు వంటి విషయంలో వాస్తవిక విధానాలు అనుసరించాలని సూచించడం సందర్భోచితం. సుదీర్ఘ అపరిష్కృత సమస్యల పరిష్కారానికి పరస్ప ర విశ్వాసమే మార్గమని ప్రధాని మోదీ స్పష్టం చేయడం సరైన మాట. యధాతథ స్థితి సమస్యకు పరిష్కారం కాదనీ, సమస్యను అధిగమిస్తూ ముందుకు పోవడమే ఏకైక మార్గమనీ నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని చెప్పడం మోడీ ముక్కుసూటి తనానికి నిదర్శనం. మొత్తమ్మీద సరిహద్దు వివాదానికి రాజకీయ పరిష్కారం కొనుగొనాలని, సమస్యను సానుకూల దృక్పథంతో సాధ్యమైనంత త్వరగా అధిగమించాలని రెండు దేశాల వారూ ఈ చర్చల్లో ఒక నిశ్చితాభిప్రాయానికి రావడం సంతోషదాయకం. సరిహద్దు సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలనే ఆలోచనల్లో భాగంగానే, సరిహద్దుల్లో ఇరుదేశాల సైనికాధికారులు కలసి సమావేశమయ్యే కేంద్రాల సంఖ్యను పెంచాలనుకోవడం, రెండు దేశాల సైనిక ప్రధాన కార్యాలయాల మధ్య ప్రత్యక్ష ఫోన్‌లైన ఏర్పాటుకు ఆమోదం తెలుపుకోవడం చైనా-భారత్ మైత్రీబంధంలో ఒక మైలురాయేనని చెప్పవచ్చు. ఇదే సందర్భంగా చైనా-భారత్‌లు కలసి పరస్పర అభివృద్ధి ప్రాతిపదికగా పలు కీలకమైన ఒప్పందాలు కూడా చేసుకున్నాయి.

ఈ ఒప్పందాలన్నీ ఇరుదేశాల సంబంధబాంధవ్యాలను ఒక్కసారిగా మార్చివేయకపోవచ్చు కానీ, భవిష్యత్తులో ఇరుదేశాల స్నేహయాత్రలో మంచి ఫలితాలనే ఇచ్చే అవకాశం ఎంతైనా వుంది. అటు ఆర్థిక బంధాలు, మరోవైపు ఇరుదేశాల ప్రగతికి చేసే యత్నాలూ రెండూ జమిలిగా రెండు దేశాలకూ ప్రయోజనం చేకూర్చేవే. ఇరుదేశాల మధ్య వాణిజ్య బంధాలు మళ్ళీ మెరుగుపడేందుకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఇటీవలి భారత్ పర్యటన దోహదపడిందని అనుకోవచ్చు. చైనా పర్యటనలో భాగంగా, ప్రధాని మోడీ షాంఘైలో మాట్లాడుతూ, చైనా-భారత్‌లు పేదరికాన్ని తొలగించేందుకు ఉమ్మడిగా కొత్త అభివృద్ధి శిఖరాలను అందుకోవాలని, ప్రపంచంలోని మూడవ వంతు జనాభా ఈ రెండు దేశాల్లోనే వున్నందున, ఇది ప్రపంచానికి ఎంతో మేలు కలిగిస్తుందనీ ఆకాంక్షిం చడం అందరినీ ఆకట్టుకున్న విషయం. కాగా, ఎంతో పవిత్రమైన కైలాస్ మానస సరోవర్ యాత్రకు వెళ్ళే యాత్రీకుల సౌలభ్యం కోసం రెండవ ప్రయాణమార్గం వచ్చే నెలనుంచే అందుబాటులోకి వస్తుందని చెప్తూ, అందుకు ప్రధాని మోడీ చైనాకు ధన్యవాదాలు తెలిపారు కూడా. ఇవన్నీ కూడా చైనాతో గతంలో ఎన్నడూ లేనంతగా మైత్రీబంధాన్ని పెంచుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అందులోనూ ఇప్పట్లో ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించిన 'మేకిన్ ఇండియా' నినాదం అన్ని దేశాలతో పాటూ చైనానూ ఆకర్షిస్తూనే వుంది. తమ దేశంలోని పారిశ్రామికవేత్తలకు ఇది లాభిస్తుందని చైనా భావిస్తోంది కూడా. ప్రధాని చైనా పర్యటన సందర్భంగా, ఇరుదేశాల మధ్య దాదాపు 22 బిలియన్ల డాలర్లు విలువజేసే 26 ఒప్పందాలు కుదరడం ఎంతైనా అపూర్వమే. ఏదేమైనా ప్రధాని చైనా పర్యటన అటు వాణిజ్యపరంగా, ఇటు గతంలో వున్న జటిల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమయ్యేవిధంగా వుండడం ఎంతైనా శుభ పరిణామమేనని భావించవచ్చు. అంతేకాదు, ఇరు దేశాల స్నేహయాత్రలో ప్రధాని చైనా పర్యటన మరో మేలి మలుపేనని చెప్పవచ్చు.

## చైనాతో మైత్రి



ప్రధాని నరేంద్రమోడీ చైనా పర్యటన విజయవంతమైనట్లే. అటు ఎంతోకాలం నుంచి జటిలంగా వున్న సరిహద్దు సమస్యల పరిష్కారానికి, మరోవైపు వాణిజ్య పరంగా ఇరుదేశాల అభివృద్ధికీ మార్గం సుగమ మయ్యేలా ప్రధాని పర్యటన ఆద్యంతం ఎంతో స్నేహపూర్వకంగా, సఫలీకృతంగా సాగింది. చైనా - భారత్‌లు కలసి ఈ సందర్భంగా 22 బిలియన్ల డాలర్ల విలువజేసే 26 ఒప్పందాలు చేసుకోవడం నిజంగా అపూర్వమైన విషయమే!.. ఇరుదేశాల స్నేహయాత్రలో ఇది మరో మేలిమలుపేనని చెప్పవచ్చు.

## రెడ్‌క్రాస్ రక్తనిధిపై కలెక్టర్ అసంతృప్తి

నెల్లూరు మద్రాసుబస్టాండ్ వద్దగల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ యం.జానకి తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రక్తనిల్వలు, సేకరించిన వివరాలను పరిశీలించారు. ప్రాణాపాయ స్థితిలో వస్తున్న రోగులకు రక్తం అందించే దిశలో నిర్లక్ష్యం వహించ రాదని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. నిర్వహణ సరిగా లేదంటూ అసహనం వ్యక్తం చేసారు. ఇక్కడ జరుగుతున్న అవకతవకలను నివారించేందుకు సిసి కెమెరాలను అమర్చాలని, రక్తాన్ని స్క్రీనింగ్ చేసి బార్ కోడింగ్ సిస్టంను ఏర్పాటు చేయాలన్నారు. గతేడాది 16వేల యూనిట్లను సేకరించారని, ఈ ఏడాది 20వేల యూనిట్లు లక్ష్యంగా రక్తసేకరణ జరగాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రక్తనిధి కన్వీనర్ డాక్టర్ సి.వి. రమాదేవి, రెడ్‌క్రాస్ మేనేజర్ కృష్ణమూర్తి, మెడికల్ ఆఫీసర్ డి. పెంచలసుబ్బయ్య, జీవన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇక పాన్‌కార్డు ఉంటేనే రిజిస్ట్రేషన్





**ఇక నుంచి ఆస్తులు అమ్మినా, కొనుగోలు చేసినా తప్పనిసరిగా పాన్‌కార్డును సమర్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి.**

పాన్‌కార్డు నెంబరు ద్వారా క్రయవిక్రయదారుల ఆర్థిక లావాదేవీలు బయటపడే విధంగా చట్టానికి రూపకల్పన చేసారు. ఇప్పటివరకు భూములు, ఇళ్ల క్రయవిక్రయాలు జరిపి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో ఎక్కువమంది ఆదాయపన్ను చెల్లించడం లేదు. అయితే ఇక నుంచి రూ.లక్ష అంతకన్నా విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు పాన్‌కార్డు వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆస్తుల కొనుగోళ్లలో నల్లధనం వినియోగాన్ని నియంత్రించేందుకు కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఈ నిబంధన రాష్ట్రంలోని 13జిల్లాలలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలులోకి రానుంది. రిజిస్ట్రేషన్ సమయంలో పాన్ కార్డుతో పాటు ఫారం 60, 61 క్రింద వివరాలు అందించేలా నమూనా రూపొందించారు. ప్రస్తుతం రూ.5లక్షలు అంతకన్నా ఎక్కువ ఆదాయం వున్న వారు ఆదాయపన్నులు చెల్లిస్తున్నారు. అయితే ఇక నుంచి రూ.లక్ష అంతకన్నా ఎక్కువ ఆస్తుల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా పాన్‌కార్డు ఇవ్వాల్సిందే. పాన్‌కార్డు లేకుండా ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరగవు. భూములు, ఇంటి స్థలాలు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం క్రయ, విక్రయదారులు ఇద్దరికి పాన్‌కార్డు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు విధించారు. ఇద్దరిలో ఏ ఒక్కరికి పాన్‌కార్డు లేకున్నా రిజిస్ట్రేషన్ జరగదు. ఈ నూతన విధానంలో ఎక్కడ రిజిస్ట్రేషన్ జరిగినా పాన్‌కార్డు ఆధారంగా ఆదాయపు పన్ను శాఖ అధికారులకు తెలిసిపోతుంది. వారు సంబంధిత వ్యక్తి నుంచి ఆదాయపన్ను రాబడతారు.

## టూరిజం అభివృద్ధికి కృషి

రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి కోసం చర్యలు వేగవంతంగా చేపడుతున్నామని, అందులో భాగంగా కొన్ని ప్రాంతాల్లో అటవీశాఖ నుంచి వచ్చే అభ్యంతరాలను తొలగించుకుని కలసి కట్టుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి నీరజ్‌కుమార్ ప్రసాద్ తెలిపారు. సోమవారం శ్రీసిటిలో పర్యటించిన అనంతరం బి.వి.పాళెం పడవలరేవుకు ఆయన చేరుకున్నారు. అటవీశాఖ డిఎఫ్ఓ చంద్రశేఖర్‌తో కలసి ఆయన పడవలో పులికాట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ టూరిజం అభివృద్ధికి బీవీపాళెం, ఇరకం ప్రాంతాలు అనుకూలంగా ఉన్నాయన్నారు.

ఈ సమావేశంలో జిఎం ప్రకాష్, ఎస్ఇ వెంకటేశ్వర్లు, డిఇ సత్యనారాయణ, అటవీశాఖ రేంజ్ అధికారి బిఎస్ కుమార్‌రాజా, హరిత యూనిట్ మేనేజర్లు సునీల్‌రెడ్డి, సాల్విన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సిఆర్ పేరు పెట్టాలి

నెల్లూరుజిల్లా రాజకీయ చాణక్యత, సమయ స్ఫూర్తి, అమోఘ వాక్చాతుర్యం స్వర్గీయ నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సొంతం. స్థానిక సంస్థల పరిపాలనా విధానాన్ని ఆయన కొత్త పుంతలు తొక్కించారు. జిల్లా పరిషత్ పాలనకు రోల్‌మోడల్ ఎన్‌సిఆర్. వేలాదిమందికి ఉపాధికల్పించారు. పాత జడ్పీ భవనంకు అప్పటి జడ్పీ ఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆయన పేరు పెట్టారు. ఇప్పుడు కూడా అన్ని పార్టీల వారు జెండాలు, అజెండాలు పక్కన పెట్టి జడ్పీ నూతన భవనానికి ఆయన పేరు పెట్టేలా తీర్మానం చేయాలి.

**వై. లక్ష్మీనరసింహమూర్తి, నెల్లూరు.**

## గోభక్షణ శాలలు

హిందూ మతంలో ఆవుకు అమ్మ తర్వాత స్థానం వుంది. గతంలో ప్రతి ఇంటా గోవు ఉండి పూజింపబడేది. ఆవు పాలు, మూత్రం, గోధూళి, నెయ్యి, వెన్న అన్నీ పవిత్రములే! ఇటీవల పెద్దపెద్ద దేవస్థానాలలో గోశాలలు వెలిసాయి. అధికారుల నిర్లక్ష్యం వలన గోవుల చావులు పెరిగాయి. గోవధశాలలకు ఆవులు తరలిపోతున్నాయి. హిందువులంతా ఏకమై గోవధను అడ్డుకోవాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## పాస్‌పుస్తకాల రద్దు సబబే!

రాష్ట్రంలో పాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్‌ల సంప్రదాయాన్ని రద్దు చేస్తే రైతులు ఎంతగానో సంతోషిస్తారు. పాస్‌పుస్తకాలు తీసుకుంటే రెవెన్యూవాళ్లు రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. లంచాలు ఇవ్వనిదే పాసుపుస్తకాలు తెచ్చుకునే పరిస్థితి లేకుండాపోతోంది. లంచమిచ్చినా సకాలంలో పాస్‌బుక్‌లు వస్తున్నాయా అంటే అదీ లేదు. పాస్‌బుక్‌లు రద్దు చేస్తే చంద్రబాబు రైతులకు ఈ రకంగానన్నా మంచి చేసినట్లనిపించుకుంటాడు.

**– టి.కొండారెడ్డి, జలదంకి.**

## పోలంరెడ్డికి తగదు





నెల్లూరులో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కాంస్య విగ్రహం అవసరమా అని కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడడం తగదు. నెల్లూరు జిల్లాలో కాంగ్రెస్‌పార్టీకి మూల స్థంభం నేదురుమల్లి. 2004లో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అనుచరునిగా వున్న పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి కోవూరు నుండి కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చింది జనార్ధన్‌రెడ్డే. ఆయన చొరవతో తొలిసారి ఎమ్మెల్యే అయిన పోలంరెడ్డి ఏరు దాటాక తెప్పతగలేసే చందంగా వ్యవహరించడం దారుణం.

**వై.శ్రీవాణి, నెల్లూరు.**



తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు మళ్లీ బీద రవిచంద్రకే అప్పగించారు. పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో పలువురు నాయకులు అధ్యక్షపదవిని ఆశించినప్పటికీ మళ్లీ బీద రవిచంద్ర పేరునే ప్రతిపాదించడంతో ఎవరూ అభ్యంతరం చెప్పలేకపోయారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా చేజర్ల వెంకటేశ్వరరెడ్డినే మళ్లీ ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శి పదవి కోసం ఈసారి తెలుగుదేశం నాయకులు బాగానే పోటీపడ్డారు. మంత్రి నారాయణ ముఖ్యఅనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అయితే చివరి దాకా ప్రయత్నించాడు. అయితే మంత్రి ఆయన కోసం బలంగా ప్రయత్నించకపోవడంతో చేజర్లనే ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారు.

# రవిచంద్రుడికే బాధ్యతలు

రవిచంద్ర జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం ఇది రెండో సారి. రెండేళ్ల క్రితం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ పదవి నుండి తప్పుకుని రవిచంద్రకు అప్పగించారు. 1999 నుండి తెలుగుదేశంపార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న రవిచంద్ర ఇప్పుడు పార్టీలో చాలా కీలకంగా మారారు. 2009లోనే జడ్పీ ఛైర్మెన్ పదవిని త్రుటిలో కోల్పోయారు. 2013లో జరిగిన శాసన మండలి ఎన్నికల్లోనూ ఎమ్మెల్సీ చేజారింది. పార్టీ అధికారంలోకి వచ్చాక మొన్నటికి మొన్న ఎమ్మెల్సీ పదవి చేతిదాకా వచ్చి జారిపోయింది. పార్టీ పదవులు మాత్రం రవిచంద్ర అడక్కుండానే వస్తున్నాయి.

## రామాయణంలో పిడకల వేట...

పార్టీ అనుబంధ సంఘాల ఎంపికపై జిల్లా నాయకులు కొండను తవ్వి ఎలుకను పట్టారనే చెప్పవచ్చు. ఇటీవల అనుబంధ సంఘాల ఎంపికపై మంత్రి నారాయణతో పాటు జిల్లా అధ్యక్షుడు రవిచంద్ర, ఇతర నాయకులంతా పార్టీ ఆఫీసులో జాగరణ చేశారు. తెల్లారుజామున 4.30గంటల దాకా మేల్కొని కసరత్తు చేశారు. ఒకటికి నాలుగు టీలు తాగుతూ రాత్రంతా మేల్కొన్నారు. గతంలో ఎప్పుడూ తెల్లార్లూ మేల్కొని కమిటీలు వేసిన దాఖలాలు లేవు. కానీ ఇప్పుడు చీకటి వీరుడు నారాయణ ఆధ్వర్యంలో కమిటీలు వేయాల్సి వచ్చేసరికి నాయకులకు నిద్దుర పాట్లు తప్పలేదు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడుగా శింగంశెట్టి రవి చంద్ర, జిల్లా తెలుగుమహిళా అధ్యక్షురాలిగా కార్పొరేటర్ పొత్తూరి శైలజ, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా రియాజ్, బిసి సంఘం అధ్యక్షుడుగా అన్నం దయాకర్‌గౌడ్, రైతు సంఘం అధ్యక్షుడిగా రావూరు సుందరరామిరెడ్డి, జిల్లా తెలుగు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా కాకర్ల తిరుమలనాయుడు, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా సునీల్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రంగారావులను ఎంపిక చేసి మంత్రి ఆ జాబితాను ఆన్‌లైన్‌లో పెట్టి అధిష్టానానికి పంపించారు. ఈ పదవులలో కొత్త వాళ్లకు పెద్దపీట వేయడంపై పార్టీలో సీనియర్లు కడుపు మంటతో రగిలిపోతున్నారు.

# ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టించాలి

## - డిజిపి వెంకటరాముడు




జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టాలని, ఎర్రచందనాన్ని అక్రమంగా తరలించుకుపోయే స్మగ్లర్ల ఆట కట్టించాలని, స్మగ్లర్లు ఎవరెంతటి వారైనా సరే ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపి వెంకటరాముడు స్పష్టం చేశారు. మంగళవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర స్మారక సమావేశ మందిరంలో ఆయన జిల్లా పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఎర్రచందనం అక్రమరవాణాను ఆదిలోనే ఆరికట్టాలన్నారు. అడవుల్లో ఎర్రచందనం చెట్లను కొట్టివేసి అక్రమంగా తరలించుకుపోకుండా కూంబింగ్ దళాలను రంగంలోకి దించాలని ఆయన ఆదేశించారు. ఎర్రచందనం నిల్వలు వున్న ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని, అడవుల్లో గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎర్రచందనం అక్రమరవాణాను అరికట్టేందుకు పోలీసు అధికారులు తీసుకుంటున్న చర్యలను జిల్లా ఎస్పీ గజరావుభూపాల్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ ఎన్.సంజయ్, ఏఎస్పీ రెడ్డి గంగాధర్‌తోపాటు పలువురు డిఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

# కమిషనర్ నియామకంలో జాప్యమెందుకు?


మహిళల సమస్యలు వింటున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వెళ్లిపోయి నెలరోజులు దాటినా కొత్త కమిషనర్ నియామకంలో జాప్యం ఎందుకు జరుగుతోందని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ నెల 20వ తేదీన ఆయన 35వ డివిజన్‌లోని గౌతమినగర్, సూర్యప్రకాష్ కాలనీ, ప్రగతినగర్, లేక్‌వ్యూ కాలనీల్లో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత కార్పొరేషన్‌లో మున్సిపల్ శాఖామంత్రి నారాయణ కమిషనర్‌ను నియమించుకోలేకపోతున్నారని విమర్శించారు. తాను నెల్లూరులో వున్నా, తుళ్ళూరులో వున్నా, సింగపూర్‌లో వున్నా, హైదరాబాద్‌లో వున్నా, చైనాలో వున్నా, జపాన్‌లో వున్నా కంప్యూటర్ల ద్వారా పనులు జరిపిస్తానని, ఐప్యాడ్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తానని చెప్పుకునే ఈ హైటెక్ మంత్రి నెల్లూరుకు కమిషనర్‌ను నియమించలేడా? అని ప్రశ్నించారు. నెల్లూరు సమస్యల గురించి మంత్రి గారి కంప్యూటర్‌కు తెలియకుండా పోయాయా? అని ఎద్దేవా చేశారు. నగరంలో సమస్యలు పరిష్కరించకుంటే కార్పొరేషన్ ముందు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కార్పొరేటర్ వై.ప్రశాంతికిరణ్, వైసిపి నాయకులు పెద్దమస్తాన్, చిన్నమస్తాన్, సర్దార్, శరత్‌చంద్ర, ఎస్‌డి మస్తాన్‌భాయ్, రంజిత్, సలీమ్, కంచర్ల పెంచలమ్మ, విజయ్, ప్రవీణ్, రాజేష్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# న్యూజెర్సీలో

# "నాటా" కేంద్ర కార్యాలయం ప్రారంభం!



నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్(నాటా) తమ భవిష్యత్ కార్యకాపాలను ప్రపంచ వ్యాప్తంగా వున్న తెలుగువాళ్ల కోసం విస్తరించడానికి వీలుగా న్యూజెర్సీలోని ప్రిన్స్‌టౌన్‌లో తమ శాఖ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించుకుంది. నాటా హెడ్‌క్వార్టర్స్‌గా పిలువబడే ఈ కార్యాలయాన్ని నాటా అడ్వయిజరీ కౌన్సిల్ ఛైర్మెన్, అమెరికా వై.యస్.ఆర్.గా పిలువబడే డా|| ప్రేమ్‌సాగర్‌రెడ్డి ప్రారంభించగా, న్యూజెర్సి సెనటర్ శాం తాంప్‌సన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నాడు. అమెరికా కాలమాన ప్రకారం మే9వ తేదీ శనివారం ఉదయం ఈ కార్యక్రమం జరిగింది.


ఈ సందర్భంగా "నాటా" వార్షిక బోర్డు సమావేశాన్ని కూడా ఇక్కడ నిర్వహించారు. నాటా 2016లో డాలస్‌లో జరుపనున్న 3వ ద్వైవార్షిక సమావేశంతో పాటు భవిష్యత్‌లో చేయదలుచుకున్న సేవా కార్యక్రమాల గురించి చర్చించుకోవడంతో పాటు ఇప్పటివరకూ జరిపిన కార్యక్రమాలను సమీక్షించుకున్నారు.

నాటా ద్వైవార్షిక సమావేశం 2016లో డాలస్ నగరంలో జరగనుండగా 2018 సమావేశాన్ని ఫిలడల్ఫియాలో చేయాలని నిర్ణయించారు. నగేష్ ముక్కమళ్ళ సారధ్యంలో నాటా క్రికెట్ లీగ్‌ను ప్రారంభించాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 2016లో జరగనున్న వార్షిక సమావేశం కోసం చేస్తున్న ఏర్పాట్లని, అలాగే ఈ సమావేశం విజయవంతం చేయడానికి తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను ఈ సమావేశంలో చర్చించారు.

నాటా కార్యాలయ ప్రారంభోత్సవం, కార్యవర్గ వార్షిక సమావేశం సందర్భాలను పురస్కరించుకుని సెనటర్ శాం తాంప్‌సన్, టివి5 అమెరికా సిఇఓ శ్రీధర్ చిల్లర, కోరి బుకర్స్ కార్యాలయం సెనటర్ దినేష్, అమెరికాలో సేవా రంగంలో విశిష్ఠ గుర్తింపు పొందిన రవీందర్ తోట, డా|| మీనమూర్తి తదితరులను ఈ సందర్భంగా సత్కరించారు. న్యూయార్క్ సిటి హెల్త్ & హాస్పిటల్స్ సిఇఓ మరియు ప్రసిడెంట్ డా|| రామరాజును కూడా ప్రత్యేకంగా సన్మానించారు.

నాటాకి అడ్వయిజరి కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌గా వుంటున్న డా|| ప్రేమ్‌సాగర్‌రెడ్డి, అమెరికాలోని మొదటి 50ప్రముఖ ఆసుపత్రిలలో కొన్నివిగా ఆయన సంస్థలను తీర్చిదిద్ది భారతీయులంతా గర్వించే స్థాయికి ఎదిగినందుకు గాను ఆయనను ఈ సమావేశంలో ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు.

వివిధ ప్రాంతాలకు చెందిన 500మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొనగా నాటాతో పాటు అమెరికాలో వున్న అన్ని తెలుగు సంఘాల ప్రతినిధులు కూడా ఈ ప్రారంభోత్సవ వేడుకతో పాటు అనంతరం రాత్రి జరిగిన (మిగతా 11వ పేజీలో)



## రామకృష్ణకు డాక్టరేట్

నెల్లూరు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎం.రామకృష్ణకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'న్యాయ విభాగంలో పత్రికా స్వేచ్ఛ, భారత దేశ పార్లమెంటరీ ప్రత్యేకతపై ప్రొఫెసర్ ఎ.సుబ్రహ్మణ్యం సహకారంతో రామకృష్ణ పరిశోధన చేశారు. ఇందుకుగాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

## పశువుల శాఖకు సోమయ్య

వివాదాల మధ్య జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఇడిగా ఈ నెల 11వ తేదీన బాధ్యతలు చేపట్టిన సోమయ్యను వారంరోజులు తిరక్కుముందే ఆయన మాతృసంస్థ అయిన పశుసంవర్థక శాఖకు బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పశుసంవర్థకశాఖకు చెందిన సోమయ్య ఇంతకుముందు రెండేళ్ళు ఎస్సీ కార్పొరేషన్ ఇడిగా చేసారు. ఆయన హయాంలోనే పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. కొన్ని నెలల క్రితం ప్రభుత్వం డిప్యుటేషన్ను రద్దు చేయడంతో పశుసంవర్థకశాఖకు వెళ్లారు. మళ్లీ రాజకీయ పలుకుబడి ప్రయోగించి ఈ నెల 11న ఎస్సీ కార్పొరేషన్ ఇడిగా వచ్చారు. ఆయన వచ్చాడని ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. మీడియా కూడా సోమయ్య మీద దుమ్మెత్తి పోసింది. ఈ నేపథ్యంలో ఆయనను ఉన్నతాధికారులు వెనక్కి పంపక తప్పలేదు.

## తెదేపా జిల్లా మహానాడు 25న

నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని అనిల్ గార్డెన్స్‌లో తెలుగుదేశంపార్టీ జిల్లా మహానాడును ఈ నెల 25న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర పేర్కొన్నారు. మహానాడుకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పార్టీ సీనియర్ నాయకులు, మంత్రులు హాజరుకానున్నారు. దీనికి జిల్లాలోని గ్రామ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, మండల పార్టీ కార్యవర్గాలు, పార్టీకి చెందిన శాసన సభ్యులు, ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మాజీశాసనసభ్యులు, మాజీ పార్లమెంటు సభ్యులు, రాష్ట్ర పార్టీ, రాష్ట్ర పార్టీ అనుబంధ సంస్థలలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నవారు... పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పీటీసీలు, మండల పరిషత్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సహకార సంఘాల అధ్యక్షులు తదితర ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

## ఎస్బీ డిఎస్పీ-2గా శ్రీనివాసరావు

నెల్లూరు స్పెషల్ బ్రాంచ్(ఎస్బీ) డిఎస్పీ-2గా విక్రమ శ్రీనివాసరావు 16వ తేదీన బాధ్యతలు చేపట్టారు. గుంటూరు రూరల్ ఎస్పీ, ఎస్బీ సెల్ డిఎస్పీగా పని చేస్తున్న శ్రీనివాసరావు 1989బ్యాచ్‌కు చెందినవారు. జిల్లాలో పలు చోట్ల పనిచేసారు. బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లా ఎస్పీ డాక్టర్ గజరావు భూపాల్, అదనపు ఎస్పీ రెడ్డి గంగాధరరావులను గౌరవపూర్వకంగా కలిసారు.



## జిల్లాకు ఇన్‌ఛార్జ్‌గా సిద్ధా చిత్తూరుకు నారాయణ



నెల్లూరుజిల్లాకు ఇన్‌ఛార్జ్ మంత్రిగా రవాణాశాఖ మంత్రి సిద్ధా రాఘవరావును నియమించారు. జిల్లాలో జరిగే అభివృద్ధి సమీక్షా సమావేశాలతో పాటు అన్ని అభివృద్ధి కార్యక్రమాలలోనూ ఇన్‌ఛార్జ్ మంత్రికి ప్రాధాన్యత ఉంటుంది. అలాగే జిల్లాకు సంబంధించిన అధికారుల బదిలీలలో ఇన్‌ఛార్జ్ మంత్రే కీలకం కానున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగింది. మన జిల్లాకు చెందిన మున్సిపల్ మంత్రి పి.నారాయణను చిత్తూరుజిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా నియమించారు.

## ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడుగా టివి9 మురళి



నెల్లూరుజిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడిగా టివి9 జిల్లా ప్రతినిధి చెన్నూరు మురళీ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 18వ తేదీన జరిగిన అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా ఇమ్మానియేల్‌బాబు(ఏపిఎన్), ప్రధానకార్యదర్శిగా దూదల విజయకుమార్(ఎన్‌టివి), ఉపాధ్యక్షులుగా ఖాజారంతుల్లా(నెం.1టివి), కోశాధికారిగా గుంజి వెంకటప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా విప్పర్తి వంశీధర్(ఐన్యూస్), సంయుక్త కార్యదర్శిగా దేవా(10టివి)లను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గసభ్యులుగా ఇంగిలాల రాజేష్, ఎస్.అమర్‌నారాయణ, కె.సి.పెంచలయ్య, కె.మహేష్, జె.రాధాకృష్ణలను ఎన్నుకున్నారు.

## వ్యాపారస్తులు ఏకం కావాలి ఆనం వివేకా



వ్యాపారస్తులు ఏకం కావాల్సిన అవసరం వచ్చిందని కాంగ్రెస్‌పార్టీ పిసిసి ఉపాధ్యక్షుడు ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు మండపాలవీధిలో మునిసిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ కట్టడాలను తొలగించడాన్ని ఆనం వివేకా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనాలు నిర్మించే వరకు చూసీచూడనట్లు వుండి, తర్వాత పగులగొట్టేందుకు వస్తారని, డబ్బులిస్తే ఇవేమీ ఉండవని, ఇవ్వకుంటే అన్ని విధాలా ఇబ్బందులు పెడతారన్నారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి నరేంద్ర, చంద్ర, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ పట్ల అవగాహన అవసరం




ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని, ఎయిడ్స్‌వ్యాధితో ఎవరూ చనిపోకుండా వుండేలా చూడాలని డిఎంఅండ్ హెచ్‌ఓ భారతీరెడ్డి అన్నారు. ఇంటర్నేషనల్ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా, ఆదివారం సాయంత్రం నెల్లూరులోని బిఇడి కళాశాల వద్ద జరిగిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం డిఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ, హెచ్ఐవి, ఎయిడ్స్‌ల కారణంగా మృతిచెందిన వారికి నివాళులర్పించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. అందరూ క్యాండిల్స్ చేతపట్టి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత, మృతుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌ఓ రమాదేవి, పలువురు స్వచ్ఛంధసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చేయూతనిస్తే చేయి కొరికాడు

తన దగ్గర గుమస్తాగా పనిచేసిన వ్యక్తి సొంతంగా వ్యాపారం చేసుకుని అభివృద్ధి చెందుతానంటే చేయూతనిచ్చిన పాపానికి ఓ వ్యాపారి 67లక్షల విలువచేసే బంగారు నగలను పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన ఈ నెల 17వ తేదీన నెల్లూరులో జరిగింది. పప్పులవీధికి చెందిన కొండా శ్రీనివాసులు మండపాలవీధిలో శబరీనాథ్ జ్యూయలరీ గోల్డ్‌షాపు నిర్వహిస్తున్నాడు. నవాబుపేటకు చెందిన పి.తులసీరాం అతని వద్ద చాలాకాలంగా నమ్మకంగా పనిచేస్తూ వచ్చాడు. ఇటీవలే తాను సొంతంగా వ్యాపారం పెట్టుకుంటానని తులసీరాం అడిగితే అందుకు శ్రీనివాసులు సాయం చేసాడు. తులసీరాం కూడా మండపాలవీధిలోనే షాపు పెట్టాడు. శ్రీనివాసులు దుకాణంలోని నగలను తీసుకెళ్లే తులసీరాం తన దుకాణంకు వచ్చిన ఖాతాదారులకు చూపించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 17న షాపుకు కస్టమర్లు వచ్చారని, వారికి చూపించి తెస్తానని 67లక్షల విలువచేసే రెండున్నర కేజీల బంగారు నగలను తులసీరాం తీసుకెళ్లాడు. ఆ పోవడం పోవడం ఇక తిరిగిరాలేదు. ఆ నగలతో తులసీరాం ఉడాయించాడు. కొండా శ్రీనివాసులు మూడోనగర పోలీసులను ఆశ్రయించాడు.

## నెల్లూరు కబుర్లు

## సీఎం పర్యటన వాయిదా

ఈ నెల 20న జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన ఉంటుందనుకున్నారు. నీరు-చెట్టు కార్యక్రమం క్రింద ఆయన ఉదయగిరి లేదా వెంకటగిరి నియోజకవర్గాలలో ఏదో ఒక కాలువ గట్టు మీద నిద్రపోయే కార్యక్రమం పెట్టాలనుకున్నారు. ఈమేరకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లకు కూడా పూనుకుంది. అయితే సీఎం పర్యటన ఆ తేదీన ఖరారు కాలేదు. ఈ నెలలో సీఎం ప్రోగ్రామ్ లేనట్లే!




## సీఏ విద్యార్థులకు చేరువగా ఐసిఏఐ

సీఏ చదివే విద్యార్థులకు చేరువగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసిఏఐ) సేవలను విస్తృతం చేస్తున్నట్లు ఆ శాఖ ఉపాధ్యక్షుడు సీఏ ఎం.దేవరాజారెడ్డి తెలిపారు. సోమవారం నెల్లూరులో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సిఏను దూరవిద్యగానే విద్యార్థులు అభ్యసించాల్సి ఉంటుందన్నారు. కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో 1949లో చట్టబద్ధంగా ఏర్పాటు చేసిన ఐసిఏఐ ఆధ్వర్యంలో విద్యావిధానం శిక్షణ, పరీక్షల నిర్వహణ కొనసాగుతాయన్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఐదు రీజినల్ కౌన్సిళ్ల పరిధిలో 148శాఖలు పని చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం సీఏ విద్యావిధానంలో మార్పులు వచ్చాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. విద్యార్థులను తప్పుదారి పట్టించేలా కోచింగ్ సెంటర్లు చేస్తున్న ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ప్రతి జిల్లా కేంద్రంలోని ఐసిఏఐ శాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు. బయట కోచింగ్ సెంటర్లకు లక్షల రూపాయలు చెల్లించడం సరికాదని, సిఏను రూ.32వేల ఫీజుతోనే పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. సిఏకు ఇంటర్ తర్వాత సిపిటి పరీక్ష వ్రాయడం ద్వారా, డిగ్రీ తదుపరి సిపిటి లేకుండా నేరుగా సీఏలో చేరే అవకాశం ఉందన్నారు. నెల్లూరులోని వెంకటాచలంలో వున్న ఐసిఏఐ నెల్లూరు శాఖకు అనుబంధంగా నెల్లూరు నగరంలో శిక్షణకు అనుకూలమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఐసిఏఐ నెల్లూరుశాఖ ఛైర్మెన్ సిఏ పి.వి.రామరాఘవరావు, ఉపాధ్యక్షుడు సిఏ యుగంధర్‌రెడ్డి, కార్యదర్శి సిఏ జె.వి.చలపతిరావు, సికాసా ఛైర్మెన్ ఆమంచర్ల శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నిప్పుల కుంపటి


నెల్లూరు నిప్పుల కుంపటిగా మారింది. నిన్న మొన్నటివరకు కొంచెం ఫర్వాలేదనిపించిన ఎండలు మంగళవారం నుండి ఊపందుకున్నాయి. ఆరోజు నుండే ఉష్ణోగ్రతలు 43డిగ్రీలను తాకాయి. భానుడి భగభగలకు జనం తట్టుకోలేకపోతున్నారు. ఇంట్లో నుండి కాలు తీసి బయటపెట్టాలంటేనే భయపడుతున్నారు. ఉదయం 11గంటల నుండి సాయంత్రం 5గంటల దాకా రోడ్ల మీద తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి వడగాలులు కూడా తోడవుతుండడంతో జనం మలమల మాడిపోతున్నారు. అయితే ఒక్క ఉపశమనం ఏంటంటే మే నెలలో కూడా నగరంలో కరెంట్‌కోతలు లేకపోవడం. కోతలు కాని వుంటే జనానికి నరకయాతనే!

## లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ముసవ్వీర్



నెల్లూరు జెండావీధికి చెందిన సూక్ష్మకళాకారుడు షేక్ ముసవ్వీర్ తన అద్భుత కళాప్రతిభతో "లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్"లో చోటు దక్కించుకున్నారు. సృజనాత్మకతతో మత సామరస్యాన్ని చాటుతూ వివిధ అంశాలకు సంబంధించి స్వర్ణంతో పలు సూక్ష్మకళా రూపాలను తీర్చిదిద్దిన ముసవ్వీర్ కొన్నేళ్లుగా 19 గ్రాముల స్వర్ణంతో 50కిపైగా స్వర్ణసూక్ష్మ నమూనాలను తీర్చిదిద్ది కరతాళ ధ్వనులు అందుకుని ఉన్నారు. తన ప్రతిభను లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్ ఎడిటర్ విజయ్ గోష్, కోకోకోలా ఇండియా ప్రెసిడెంట్ వెంకటేష్‌లు గుర్తించి జాతీయ రికార్డుకు సంబంధించిన ధృవపత్రాన్ని అందజేశారని సోమవారం ముసవ్వీర్ విలేకర్లకు తెలిపారు. తాను లిమ్కాబుక్ రికార్డును అందుకోవడం ఆనందంగా ఉందని, తనకు సహాయసహకారాలు అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని తెలిపారు.





# ఇసుక దొంగలపై నిఘాకళ్లు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం చేపడుతున్న పటిష్టచర్యల్లో భాగంగా, ఆయా రీచ్‌లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం నెల్లూరు రూరల్ మండల పరిధిలోని పొట్టేపాళెం ఇసుక రీచ్ వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు ఎలా పనిచేస్తున్నాయో, వాటి నిర్వహణ ఎలా వుంటోందో స్వయంగా జిల్లా కలెక్టర్ ఎం.జానకి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 32 ఇసుకరీచ్‌లు వున్నాయని, అందులో ముఖ్యమైన పొట్టేపాళెం, పల్లెపాళెం ఇసుకరీచ్‌ల వద్ద ప్రయోగాత్మకంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పొట్టేపాళెం ఇసుకరీచ్ నుంచి ఎక్కువగా ఇసుకను తరలిస్తుండడం జరుగుతుంటుందని, అందువల్ల అక్కడ 6 సిసి కెమెరాలు ఏర్పాటుచేసి, ఎలాంటి అవకతవకలు జరుగకుండా నిఘా పెట్టామన్నారు. ఈ ప్రాంతంలో రోడ్డుమార్గాన వచ్చే ఇసుక రవాణాకు సంబంధించిన ట్రాక్టర్లు, లారీలు, ట్రక్కులు తదితర వాహనాల నెంబర్‌ప్లేట్లు సిసి కెమెరాల్లో కనిపించేవిధంగా ఏర్పాటు చేయాలని సంబంధిత సాంకేతిక సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. అదేవిధంగా, సిసి కెమెరాలు ప్రతినిత్యం సక్రమంగా పనిచేసేలా చూడాలని, ఎలాంటి సాంకేతిక సమస్య లేకుండా శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. వేబిల్లులు తీసుకునేందుకు వచ్చేవారికి సెంటర్ వద్ద వరుస క్రమంలో వచ్చేవిధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో లైటింగ్ వుండేలా సోడియం లైట్లు ఏర్పాటుచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదేవిధంగా మిగతా ఇసుక రీచ్‌లలో కూడా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డిఆర్‌డిఏ పీడీ చంద్రమౌళి, నెల్లూరు తహశీల్దార్ జనార్దన్‌రావు, సాంకేతిక సూపర్‌వైజర్, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ‘వెలుగు’బాటలో జెన్‌కో




పలు అవాంతరాలను, సమస్యలను అధిగమించి ముత్తుకూరు మండలం నేలటూరులోని దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమైంది. ఈ 1600 మెగావాట్ల విద్యుత్ కేంద్రంలో మొదటి యూనిట్ కింద 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని తిరిగి ప్రారంభించారు. ఈ విద్యుత్ కేంద్రానికి బొగ్గు సమస్య కూడా తీరింది. ఈమేరకు ఒప్పందాలు కుదిరాయి. పవర్‌గ్రిడ్ సూచన మేరకు విద్యుత్ ఉత్పత్తి పెంచారు.

2009 జూలైలో జెన్‌కో ప్రాజెక్ట్ పనులు మొదలయ్యాయి. 48నెలల్లో మొదటి యూనిట్‌ను సిద్ధం చేయాలని భావించారు. అయితే కొన్ని అవాంతరాల మూలంగా ప్రాజెక్ట్ నిర్మాణం ఆలస్యం కావడంతో అంచనా వ్యయం 8వేల కోట్ల నుండి 13వేల కోట్లకు చేరింది. 2013లో విద్యుత్ ఉత్పత్తికి ట్రయల్ రన్ నిర్వహించినప్పటికి అనేకసార్లు బాయిలర్‌లో వచ్చిన సమస్యలతో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్ పడుతూ వచ్చింది. ఈ బాయిలర్ సమస్యలకే 3లక్షల టన్నుల బొగ్గు ఖర్చయ్యింది. 2015ఫిబ్రవరి 1న మొదటి యూనిట్ 800మెగావాట్లకు సిఓడి ప్రకటించినా బొగ్గు ఒప్పందం కుదరక పోవడంతో ఇటీవలదాకా విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది.

ప్రస్తుతం కోల్ ఇండియా ఆదేశాలతో 1వ యూనిట్‌కు మహానది బొగ్గు గనుల నుండి సంవత్సరానికి 2.5 మిలియన్ టన్నుల బొగ్గు కేటాయిస్తూ ఒప్పందం కుదరడంతో ఈ ప్రాజెక్ట్‌లో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పాదనకు మార్గం సుగమమైంది.




## శ్రీసిటీని సందర్శించిన రాష్ట్ర టూరిజం కార్యదర్శి

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రధానకార్యదర్శి నీరజ్‌కుమార్ ప్రసాద్ సోమవారం శ్రీసిటి సెజ్‌ను సందర్శించారు. శ్రీసిటి ఫౌండేషన్ అధ్యక్షులు రమేష్ సుబ్రహ్మణ్యం ఆయనకు స్వాగతం పలికారు. సెజ్‌లోని మౌలిక వసతులతో పాటు ఇక్కడ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను ఆయనకు వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




సంస్మరణ

మా అభ్యున్నతికి కారకులు, మాకు స్ఫూర్తిప్రదాతలు
బంధుజనప్రియులు, సమతావాది
పూండ్ల చెంచురెడ్డి గారు
పరమపదించి తేది. 27.05.15 నాటికి
ఇరవై ఏడు సంవత్సరాలు నిండుతాయి.
ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకొంటూ...

భార్య :
పూండ్ల కామేశ్వరమ్మ

కుమారులు :
డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి
పూండ్ల వెంకురెడ్డి

మరియు
కుటుంబసభ్యులు

# అతివేగంతోనే ప్రమాదాలు

**- డిఎస్పీ బి.శ్రీనివాస్**



ఇంటర్‌సెప్టర్ వాహనం వద్ద డిఎస్పీ బి.శ్రీనివాస్

అతివేగమే ప్రమాదాలకు దారితీస్తోందని, జాతీయ రహదారిపై వాహనాల వేగం చూస్తే ముచ్చెమటలు పట్టక మానదని, ఈ వాహన వేగాన్ని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గూడూరు డిఎస్పీ బి.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం రాత్రి తన కార్యాలయానికి వచ్చిన ఇంటర్‌సెప్టర్ వాహనాన్ని డిఎస్పీ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన వేగాన్ని తెలిపే ఇంటర్‌సెప్టర్ వాహనాలను కేటాయించిందని, దీన్ని జిల్లాలోని గూడూరు డివిజన్‌లో వారం రోజుల పాటు ఉంచుతున్నారన్నారు. ఈ వాహనం మూడు విధాలుగా ఉపయోగపడుతుందన్నారు. జాతీయ రహదారిపై వేగంగా వెళ్లే వాహనాల వేగాన్ని లెక్కకడుతుందని, నిబంధనల కన్నా ఎక్కువగా వెళుతుంటే ఆ వాహనాన్ని ఫోటో తీస్తుందని, దీంతో కేసు నమోదు చేయవచ్చని వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించిన శ్వాస విశ్లేషణ పరికరం కూడా ఇందులో ఉంటుందన్నారు. వాహనం పై భాగంలో కెమెరా అమర్చారని, 360డిగ్రీల కోణంలో చుట్టూ తిరుగుతుందని, ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు చేస్తున్నప్పుడు ఈ కెమెరా ద్వారా వాహనంలో కూర్చొని చూడవచ్చన్నారు. గూడూరు నుంచి తడ వరకు ఈ వాహనం వారంరోజుల పాటు తిరుగుతుందన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవు

**- మున్సిపల్ కమిషనర్ ప్రమీల**



దుకాణాల్లో 40మైక్రాన్ల లోపలున్న ప్లాస్టిక్‌ను విక్రయించినా, వినియోగించినా బాధ్యులపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ప్రమీల అన్నారు. పట్టణంలో ఇటీవల పలు దుకాణాలపై సిబ్బందితో కలసి కమిషనర్ దాడులు చేసి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొన్నారు. నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు. ప్రజలు కూడా సహకరించాలని, ప్లాస్టిక్ వినియోగించకుండా ఉండాలన్నారు. ఈ దాడుల్లో శానిటరీ ఇన్స్‌పెక్టర్ రామారావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించి...

# ప్రాణాలు కాపాడండి





మాట్లాడుతున్న పట్టణ సిఐ టి.వి.సుబ్బారావు, ప్రక్కన ఎస్సై బాబి, పాల్గొన్న ఆటోడ్రైవర్లు

నిబంధనల ప్రకారం ఆటో నడిపి ప్రయాణీకుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లదేనని పట్టణ సిఐ టి.వి.సుబ్బారావు తెలిపారు. గూడూరులోని ఒకటవ పట్టణ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఆటో డ్రైవర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డ్రైవర్ చేతిలోనే ప్రయాణీకుల ప్రాణాలు ఉంటాయని, దాన్ని గుర్తించుకొని నడుచుకోవాలన్నారు. అదేవిధంగా ఇంట్లో కుటుంబసభ్యులు కూడా మీమీదే ఆధారపడి ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకొని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలన్నారు. ఆటోడ్రైవర్ తప్పకుండా లైసెన్సు, బీమా కలిగి ఉండాలని, ఆటో నెంబరు వాహనం లోపల, వెలుపల వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బాబి, ఆటో కార్మిక సంఘాల నాయకులు వి.వి.రమణయ్యలు పాల్గొన్నారు.

# ఈ-పాస్‌తో ఇబ్బందులు




సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్డుదారులు

ఈ-పాస్ విధానంతో తాము తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని, వేలిముద్రలు పడక రేషన్ ఇవ్వడం లేదని పట్టణానికి చెందిన పలువురు కార్డుదారులు ఆర్డీవో రవీందర్‌కు ప్రజావినతుల దినంలో విన్నవించారు. ఆ తరువాత సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. చౌకదుకాణానికి వెళ్లి వేలిముద్రలు వేస్తే తీసుకోవడంలేదని, ఐరిష్ చేస్తే అవి కూడా పనిచేయడం లేదని వాపోయారు. అంతేకాకుండా కంటికి శస్త్ర చికిత్స చేయించుకుంటే ఐరిష్ రావడం లేదని, దీంతో బియ్యం లేక పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీనికి ఆర్డీవో స్పందిస్తూ చాలాచోట్ల ఇదే సమస్య వస్తోందని, వెంటనే సాంకేతిక సిబ్బందిని పంపి సరిచేస్తున్నామన్నారు.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరులోని హైదరాబాద్ లైట్‌హౌస్ హైరర్స్ అధినేత షేక్ రియాజ్‌బాషా సోదరుడు, గూడూరు ఏఆర్‌డి డైరెక్టర్ షేక్ బషీర్ కుమార్తె **యాస్మిన్ - ఫయాజ్** (గూడూరులోని ఎండి ఎలక్ట్రికల్ వర్క్స్ అధినేత ఎండి ఖుద్దూస్ కుమారుడు)ల నిఖా ఇటీవల నెల్లూరులోని సిపిఆర్ కల్యాణ మండపంలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



రెడ్‌క్రాస్ లైఫ్‌మెంబర్ దేవిరెడ్డి సురేష్‌రెడ్డి కుమార్తె **తులసీ - ప్రదీప్‌రెడ్డి** (గూడూరు మండలం నెల్లటూరు వాస్తవ్యులు నెల్లబల్లి సుబ్బారెడ్డి - రాజేశ్వరమ్మల కుమారుడు)ల పెళ్ళి ఇటీవల నెల్లూరు టౌన్‌హాల్లో జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనలు.

# లిటిల్ ఏంజల్స్ జయకేతనం









ఎస్ఎస్‌సి-2015 ఫలితాలలో లిటిల్ ఏంజల్స్ స్కూలు విజయదుందుభి మ్రోగించి గూడూరు పట్టణంలో టాపర్‌గా నిలిచింది. ఈ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు 10కి 10 పాయింట్లు సాధించడం విశేషం. అందరు విద్యార్థులు కూడా మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులు కావడం, అందులో 27మంది విద్యార్థులకు 9.8 రావడం ఈ పాఠశాల విద్య పట్ల ఎంత అంకితభావంతో కృషి చేస్తోందో తెలియజేస్తుంది. సిహెచ్ లేఖశ్రీ, ఎన్.శ్రీనివాస్ నితీష్, ఇ.నిరంజన్, కె.సౌమ్యలు 10కి 10పాయింట్లు సాధించారు.

ఈ విజయం పట్ల స్కూలు కరస్పాండెంట్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ మా విద్యార్థులలో నలుగురు 10కి 10పాయింట్లు సాధించడం, అందరు విద్యార్థులు కూడా మొదటిశ్రేణిలో ఉత్తీర్ణులు కావడం విద్యార్థుల పట్ల మేము చూపే శ్రద్ధకు, అంకితభావానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఈ విజయానికి కారకులైన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలిపారు.

# పుట్టిన ఊరిని మరచిపోకూడదు



పేదలకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్, ఛైర్‌పర్సన్ దేవసేన

ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడినా పుట్టిన ఊరిని మరచిపోకుండా సేవ చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన అన్నారు. ప్రపంచ అస్తమా వారోత్సవాల్లో భాగంగా స్థానిక నలజాలమ్మ వీధిలో ఆదివారం సిద్ధా అలర్జీ ఊపిరితిత్తుల ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ పుట్టిన ఊరిని మరవకుండా, పేదలకు సేవ చేయాలనే దృక్పథంతో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం ఎంతో శుభ పరిణామమన్నారు. ప్రస్తుతం అస్తమాతో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు బాధపడుతున్నారని, దీని నివారణకు జాగ్రత్తలు పాటించాలన్నారు. డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడం తన లక్ష్యమన్నారు. అనంతరం ఉచితంగా పేదలకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొడిపర్తి కల్పన, వాటంబేడు శివకుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో స్వల్ప అభివృద్ధి ఆదాయముంటుంది. వ్యాపారవృద్ధికి కొత్త ప్రణాళికలను నిర్ణయం చేస్తారు. ఆదాయానికి తగినట్లు అదనపు ఖర్చులుంటాయి. దూరప్రయాణాలు, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతున్నా సానుకూలం కాగలవు. నిర్మాణాలు జరిపే వారికి, కాంట్రాక్టర్లకు వర్కర్లతో సమస్యలుండగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

పనులు నిదానంగా జరగడం వల్ల టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. బాకీల విషయంలో కొంత సర్దుబాటు జరుగుతుంది. మిమ్మల్ని కాదన్నవారు కూడా మీకు సన్నిహితులు కాగలరు. బంధువులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు రాగలవు. వృత్తివ్యాపారాలకు ఆర్థికావకాశాలు బాగుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

స్థిరాస్తుల లావాదేవీలు జరుగగలవు. బ్యాంకుల నుండి ఋణాలు, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. కొత్త పరిశ్రమలు కొత్త వ్యాపారాలకు అవకాశాలు కలిసి రాగలవు. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా వుండి ఆదాయం పెరుగుతుంది. వాహనాలు నడిపేవారు జాగ్రత్త పడవలసి ఉంటుంది. ముఖ్య వ్యవహారాలలో ఇతర పెద్దల సలహా తీసికొనడం మంచిది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వ్యాపార ఆర్థిక వ్యవహారాలు అభివృద్ధికరంగా ఉండి సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యవహారాలలో నిర్ణయాల వల్ల మంచి జరుగుతుంది. సన్నిహితుల వల్ల చిరుసమస్యలుండవచ్చును. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు లభించగలవు. ఉద్యోగులకు అధికారుల అనుకూలత బాగుంటుంది. వృత్తిపరంగా ఆదాయం పెరుగుతుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

**తేది. 22.05.2015 నుండి**
**తేది. 28.05.2015 వరకు**

ఈ వారం మీనంలో కేతువు, వృషభంలో రవికుజ బుధులు, మిధునంలో శుక్రుడు, మిధున కర్కాటక సింహ కన్యా రాశులలో చంద్రుడు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని సంచరిస్తారు.

### పంచాంగము:

**ముహూర్తములు**

తేది 28-5-2015 గురువారం ఉదయం గంట 8.37 నుండి గంట 10.47లోగా కర్కాటక లగ్నమున వ్యాపార ఉపనయన వివాహములు. కర్తరి జరుగుచున్నందున ఇండ్లకు సంబంధించిన ముహూర్తములు లేవు.

### జ్యేష్ఠమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | శుక్ర | చతుర్థి | ఉ॥ గం.6.55వ॥ |
| తేది. 23 | శని | పంచమి | ఉ॥ గం.7.28వ॥ |
| తేది. 24 | ఆది | షష్ఠి | ఉ॥గం.8.32వ॥ |
| తేది. 25 | సోమ | సప్తమి | ఉ॥గం.10.0వ॥ |
| తేది. 26 | మంగళ | అష్టమి | ఉ॥గం.11.48వ॥ |
| తేది. 27 | బుధ | నవమి | ప॥గం.1.48వ॥ |
| తేది. 28 | గురు | దశమి | సా॥గం.3.50వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. స్థిరాస్తుల క్రయవిక్రయాలకు ఆటంకాలుంటాయి. అదనపు ఖర్చులు ఎక్కువగా ఉండినా ప్రయోజనకరంగా ఉంటాయి. వ్యాపారాలలో స్తబ్దత వల్ల కొత్త పథకాలను గూర్చి ఆలోచనలుంటాయి. ఆదాయం సామాన్యం. ప్రభుత్వం నుండి అనుమతులు ఆలస్యం కాగలవు. ఉద్యోగులకు పనిభారం ఎక్కువ.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తి వ్యాపారాలలో మెరుగైన అవకాశాలు చేజారి పోవచ్చును. అదనపు ఖర్చులు పెరుగుతాయి. ఆత్మీయుల సహకారంతో సమస్యను అధిగమిస్తారు. అనుకున్న పనులు సరిగా జరగవు, అయినా మనోధైర్యానికి లోపం లేకుండా ప్రయత్నిస్తారు. ముఖ్య వస్తువులు, పత్రాలు జాగ్రత్త. ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

స్థలాలు, పొలాలు, బాకీల వ్యవహారాలు పరిష్కారానికి వస్తాయి. వృత్తి వ్యాపారాలలో కొత్త అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. సోదర వర్గానికి మేలు చేకూరుతుంది. మీ వ్యాపకాలు కార్యకలాపాలు పెరుగుతాయి. షేర్లు పెట్టుబడులు లాభదాయకం కాగలవు. విద్యార్థులకు ఉన్నతవిద్యావకాశాలు అందుతాయి. ఉద్యోగులకు ప్రోత్సాహకాలుంటాయి.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులు అధికారులకు సన్నిహితము కాగలరు. అయినా పనిభారం ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. ముఖ్యమైన విషయాలలో సమయోచిత నిర్ణయాలు తీసికొంటారు. ఇంటి రిపేర్లు, వస్తు వాహన రిపేర్లుంటాయి. వారాంతంలో పనులు నిదానంగా సాగుతాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

స్థిరాస్తుల అభివృద్ధి, క్రయవిక్రయాలు లాభాలనిస్తాయి. కుటుంబవ్యక్తులకు కొద్దిపాటి విభేదాలుండి సర్దుబాటు కాగలవు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపండి. ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు, శుభకార్యములు నిర్ణయం కావడం, సకుటుంబ ప్రయాణాలుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు, ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. అనుకోని అదనపు ఖర్చులు పైన బడగలవు. అధికారుల అనుమతులు పొందుతారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆత్మీయులు, కుటుంబసభ్యుల కొరకు ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరగడం, అభివృద్ధి ఉంటుంది. బిడ్డల వ్యవహారాలు సమస్యాత్మకంగా ఉంటాయి. నూతన పెట్టుబడులు, పథకాలు లాభిస్తాయి. ఉద్యోగప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు లభిస్తాయి. అనుకున్న పనులు సక్రమంగా జరగడం, సమస్యలు సర్దుబాటు కావడం ఉంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి జీవనం కలవారికి, ఏజెంట్లకు మంచి అవకాశాలు దొరకగలవు. వ్యాపారవర్గాలకు సామాన్య ఆదాయం ఉంటుంది మరియు మంచి వ్యాపారావకాశాలు చేజారి పోవచ్చును. వ్యవహారాలలో అనుకూలత సరిగా ఉండక ఇబ్బందులు పడతారు. బంధువులతో, ఇతరులతో మన స్పర్ధలుండవచ్చును. హామీలు ఒప్పందాల విషయంలో జాగ్రత్త అవసరం. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

మీ ఆలోచనలు, పథకాలు అనుకున్నట్లుగా జరిగి, కార్యరూపం ధరిస్తాయి. కీలకమైన వ్యవహారాలలో మంచి నిర్ణయాలు తీసికొంటారు. అయితే టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. బంధుమిత్రులను, ప్రముఖులను కలుసుకొంటారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరిగి అభివృద్ధి బాగుంటుంది. బాకీల విషయమై అనుకూలత ఉంటుంది. కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది.

# నెల్లూరు దోమల దెబ్బతో దారికొచ్చిన చైనా

శ్రీను గల్పిక

అది దేశ రాజధాని ఢిల్లీలోని పాలం విమానాశ్రయం. ప్రధాని నరేంద్ర మోడీ చైనా పర్యటనకు వెళ్లడం కోసం అప్పుడే అక్కడకు వచ్చాడు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, సుషాస్మస్వరాజ్, అరుణ్‌జైట్లీ, వెంకయ్యానాయుడు, అనంతకుమార్, సదానందగౌడ, ప్రకాశ్ జవదేకర్, ఉమాభారతిలను సెండాఫ్ ఇవ్వడానికి వచ్చారు. నరేంద్ర మోడీ విమానం ఎక్కబోతుండగా వెంకయ్యానాయుడు చేయిపట్టి ఆపి. ఆయన చేతికి రెండు పెద్ద పెట్టెలిచ్చాడు. మోడీ ఆశ్చర్యంగా... ఏంటి వెంకయ్యాజీ ఇవి అని అడిగాడు. దానికి వెంకయ్య... మీరు వెళ్లేది చైనా పర్యటనకు, అక్కడ తినడానికి పాములు, కప్పలు, బొద్దింకలు తప్ప ఏమీ దొరకవు. మీరు చూస్తేనా శాఖాహారి, అందుకే ఆకలేసినప్పుడు తింటారని నెల్లూరు నుండి అరిశెలు, లడ్లు, చక్రాలు, నువ్వుల ఉండలు తెప్పించాను. ఎందుకైనా మంచిది పట్టుకుపోండి అని చెప్పాడు. వెంకయ్యకు కృతజ్ఞతలు చెప్పి మోడీ విమానమెక్కాడు.

★★★★★

చైనాలోని షియాన్ నగరం. మోడీ అప్పుడే విమానం దిగాడు. చైనా అధ్యక్షుడు షిజిన్‌పింగ్ ఆయనకు స్వయంగా ఎదురేగి స్వాగతం పలికి కుశలప్రశ్నలు వేసుకున్నారు. తర్వాత షిజిన్‌పింగ్ మోడీని తన ఇంటికి తీసుకెళ్లాడు. లంచ్ అక్కడే ఏర్పాటు చేసాడు. డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నారు. షిజిన్‌పింగ్ వంటపాత్రల మూతలు తీసి... ఇది కప్పల పులుసు, ఇది బొద్దింకల ఫ్రై, ఇది స్నేక్-65, ఇది పిగ్-47 అంటూ వంటకాల పేర్లు చెప్ప సాగాడు. వాటిని చూడగానే మోడీకి కడుపులో దేవినట్లయ్యింది. మూడురోజులు క్రితం తిన్నది కూడా వాంతి చేసుకునే పరిస్థితి వచ్చింది. అయినా కొంచెం తమాయించుకుని... జిన్‌పింగ్‌తో... సార్, నేను శాఖాహారిని, ఈ నాన్‌వెజ్ నేను తినలేను, నేను వచ్చేటప్పుడు మా వెంకయ్య నా కోసం అరిశెలు, లడ్లు ప్యాక్ చేసి ఇచ్చాడు. ఈ పూటకు వాటితో సరిపెట్టుకుంటానని చెప్పి వెంకయ్య ఇచ్చిన అరిశెలు, లడ్లను తిని నీళ్లు తాగాడు. తర్వాత మోడీ, జిన్‌పింగ్ ఇరుదేశాల మధ్య సమస్యలపై మాట్లాడుకుందామని కూర్చున్నారు. అంతలో జిన్‌పింగ్ సెల్‌ఫోన్ మోగింది. ఆయన ఫోన్ ఎత్తి... హాయ్ నవాజ్‌షరీఫ్ బాయ్, మన పాకిస్థానీయులంతా ఎలా ఉన్నారు. ఉగ్రవాద కార్యక్రమాలు ఎలా సాగుతున్నాయి. దానికి మా సహకారం ఎల్లకాలం ఉంటుందని మరచిపోకండి అని చెబుతుండగా అవతల నుండి నవాజ్ షరీఫ్... భారత్ ప్రధాని నరేంద్రమోడీ చైనా వచ్చాడంటగా, ఆయన వచ్చారని చెప్పి మన స్నేహం విషయంలో మీ మనసేమన్నా మారుతుందేమో అని సందేహంగా అడిగాడు. అందుకు జింగ్‌పింగ్... ఛీఛీ అలాంటిదేమీ లేదు. ఆయనేదో ప్రపంచమంతా తిరుగుతున్నాడు కాబట్టి చుట్టం చూపుగా మా దేశానికీ వచ్చాడు. అంతమాత్రం చేత భారత్‌తో చేతులు కలుపుతామా? మీతో మాది ప్రాణస్నేహం, ఈ మోడీయే కాదు, ఆ దేవుడే దిగి వచ్చినా మనల్ని విడదీయలేడు అని చెప్పాడు. దీంతో నవాజ్ ఆనందంగా షుక్రియా అంటూ ఫోన్ పెట్టేసాడు. షిజిన్‌పింగ్ ఫోన్ పెట్టేసి మోడీతో... మేం రోజుకు రెండుమూడు సార్లన్నా మాట్లాడుకుంటుంటాం, మాకిది కొత్త కాదులే ఇక మీరు చెప్పేది చెప్పండని అడిగాడు. మోడీ ఉండి... ప్రపంచంలో మనవి రెండు పెద్ద దేశాలు. పరస్పరం సహకరించుకుంటే ప్రపంచాన్నే శాసించవచ్చు. మీ సైనికులు తరచూ మా సరిహద్దుల్లోకి చొచ్చుకొస్తున్నారు. ఇది పద్ధతి కాదు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో కారిడార్ ఏర్పాటుకు మీరు ఆర్థిక సహకారం అందిస్తున్నారు, మీరు అది మానండి. అరుణాచల్‌ప్రదేశ్‌పై తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం మానేయండి, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలకూ మీ సహకారమందుతున్నట్లు తెలుస్తుంది, ఇది మంచిపద్ధతి కాదు. మార్చుకోండి అని చెప్పాడు. అంతా విన్న జిన్‌పింగ్... అయిపోయిందా, ఇంకేమన్నా చెప్పాల్సింది వుందా... మీరు చెప్పిన వాటిలో ఒక్కటీ అంగీకరించేది లేదు. పాకిస్థాన్ ఉగ్రవాదానికి సాయం చేస్తాం, సరిహద్దుల్లో మిమ్మల్ని దెబ్బకొడుతూనే వుంటాం, మీ కంటి మీద కునుకు లేకుండా చేస్తామని ఖరాఖండీగా చెప్పాడు. మోదీకి చిర్రెత్తుకొచ్చింది. ఇప్పుడేం చేయాలబ్బా... చర్చలు ఫెయిలైతే స్వదేశంలో పరువుపోతుంది, ఇండియాకు పోతే ప్రతిపక్షాలు హేళన చేస్తాయని మనసులో ఆందోళన చెందాడు. ఏం చేయాలో పాలుపోక వెంటనే వెంకయ్యనాయుడుకు ఫోన్ చేసి జరిగిన విషయమంతా చెప్పాడు. వెంకయ్య వుండి... మోడీజీ, నాకు పది నిముషాలు టైం ఇవ్వండి, ఏం చేయాలో చెబుతానన్నాడు. మోడీ అలాగేనంటూ ఫోన్ పెట్టేసాడు. కరెక్ట్‌గా పది నిముషాల తర్వాత మోడీ ఫోన్ మోగింది. ఆయన ఫోన్ ఎత్తాడు. అవతల నుండి వెంకయ్యనాయుడు... మోడీకి ఫోన్‌లోనే ఏదో చెప్పాడు. వెంకయ్యతో మాట్లాడాక మోడీలో ఆత్మవిశ్వాసం కనిపించింది. వెంకయ్య ఫోన్ పెట్టేసాక మోడీ వుండి జిన్‌పింగ్‌తో... సార్, మనమిద్దరం అలా పక్కగదిలోకి వెళ్లి మాట్లాడుకుందాం, ఇక్కడైతే ఇరుదేశాల అధికారులందరూ వున్నారు, సీక్రెట్‌లు మాట్లాడుకోలేమన్నాడు. మోడీ తన కాళ్ల మీద పడతాడేమోనని, తన సమస్యలు పరిష్కరించమంటాడేమోనని జిన్‌పింగ్ మనసులో ఊహించాడు. మోడీ కోరినట్లే పక్కగదిలోకి వెళ్లారు. పది నిముషాల తర్వాత బయటకొచ్చారు. అప్పుడు చూస్తే జిన్‌పింగ్ ముఖంలో భయం, మోదీ ముఖంలో ఆనందం కనిపించసాగాయి. జిన్‌పింగ్ వెంటనే మీడియా సమావేశం ఏర్పాటు చేసి... భారత్-చైనాల మధ్య సరిహద్దు వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకుంటాం, భారత్‌లోకి మా సైనికుల చొరబాట్లను అరికడతాం, పాక్ తీవ్రవాదాన్ని కట్టడి చేస్తాం. అరుణాచల్‌ప్రదేశ్ ముమ్మాటికీ భారత్‌దే అని చెప్పాడు. ఇదంతా విని భారత్ విదేశాంగ కార్యదర్శి శంకర్... సార్, జిన్‌పింగ్ ఇంతకుముందే మన విషయంలో అంత కఠినంగా మాట్లాడాడు కదా, అంతలోనే ఎలా మారిపోయాడు. మన దారికి ఎలా వచ్చాడని మోడీని ప్రశ్నించాడు. అప్పుడు మోడీ.. జిన్‌పింగ్ అలా మాట్లాడాక నేను వెంకయ్యకు ఫోన్ చేసి ఏం చేయాలో చెప్పమని సలహా కోరాను. ఆయన మళ్లీ నాకు ఫోన్ చేసి ఒక ఐడియా చెప్పాడు. దాని ప్రకారం నేను జిన్‌పింగ్‌ను గదిలోకి తీసుకెళ్లాను. ఆ తర్వాత ఏం జరిగిందో చూడు అంటూ మోడీ అతని కళ్లముందు వేళ్లతో స్క్రీన్ గీసి పిక్చర్‌లోకి తీసుకెళ్లాడు.

★★★★★

ఆ గదిలో మోడీ, జిన్‌పింగ్ ఎదురెదురుగా కూర్చున్నారు. మోడీ వుండి... ఏదో మీ దేశం వచ్చామని బెట్టు చేస్తున్నారేమో... మొదట మేం శాంతికాముకులం, కాబట్టే మీతో సంప్రదింపులకొచ్చాను. మీరు ఇలాగే వేషాలు వేసారనుకోండి... మా దేశ అత్యున్నత శక్తి అయిన జీవాయుధాలను బయటకు తీస్తాము, ఐఆర్20- 420 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలతో మీ దేశంపై దాడికి దిగుతాం, అప్పుడు మీ దేశంలో ప్రతి ఒక్కడూ ఆసుపత్రి పాలు కావాల్సిందే, మీ ఆర్థికవ్యవస్థ కుంగిపోతుంది. మీ ఆధిపత్యం పటాపంచలవుతుందని చెప్పాడు. నెల్లూరుదోమల శక్తిసామర్థ్యాల గురించి అంతకుముందే విని ఉండడంతో షిజిన్‌పింగ్‌కు భయమేసింది. వణుకు మొదలైంది. మోడీజీ అంత పని చేయొద్దు. మీరు చెప్పినట్లే చేస్తాం అంటూ మోడీ చేతులు పట్టుకున్నాడు.

★★★★★

ఇక్కడితో సీన్ అయిపోవడంతో మోదీ ఎయిర్‌స్క్రీన్‌ను క్లోజ్ చేసి ఈ ఘనతంతా వెంకయ్యాజీదే అని చెప్పి ఆయనకు ఫోన్ చేసాడు. వెంకయ్య ఫోన్ ఎత్తగానే మోడీ జరిగిదంతా చెప్పి, కృతజ్ఞతలు తెలిపాడు. దానికి వెంకయ్య... ఇందులో నా గొప్పేం లేదు. మీరు ఫోన్ చేసి సలహా అడిగాక నేను నెల్లూరులో వున్న మా స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(64+)కు ఫోన్‌చేసి సలహా అడిగాను. ఈ ముదురుదోమల సలహా ఆయనిచ్చిందే, మనమంతా ఆయనకు సన్మానం చేయాలంటూ ఫోన్ పెట్టేసాడు.



# పురపాలకంలో ఆధిపత్య పోరు



**కావలి పురపాలక సంఘంలో అభివృద్ధి కుంటుపడిందని, అందుకు రాజకీయ నాయకులే కారణమని కావలి పురప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇందుకు కారణం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కోర్టు వివాదమేనంటున్నారు.**

వైసిపిలో గెలిచి టిడిపిలో చేరడంపై విప్ ధిక్కారణ కారణం వల్ల ఆమెపై అనర్హత వేటు వేయాలని వైసిపి నాయకులు కోర్టును ఆశ్రయించటంతో కావలి మున్సిపాలిటీ అంధకారంలో మగ్గిపోతోంది. ఛైర్‌పర్సన్ అలేఖ్యను కౌన్సిలర్‌గా కొనసాగాలని, సమావేశాలను నిర్వహించ కూడదని కోర్టు ఆదేశించడంతో వైస్‌ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్‌ను ఇన్‌ఛార్జ్ ఛైర్మెన్‌గా సమావేశం నిర్వహించేందుకు అధికారులు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జ్ ఛైర్మెన్ జి.భరత్‌కుమార్ అధ్యక్షతన సాదారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి కోసం 4కోట్ల రూపాయల నిధులను ఉపయోగించే విధంగా కౌన్సిల్ తీర్మానంలో ఆమోదింపజేశారు. అయితే వైసిపి నాయకులు కేతిరెడ్డి జగదీష్‌రెడ్డి ఆదివారం సమావేశం నిర్వహించటం మున్సిపల్ నిబంధనలకు విరుద్ధమని హైకోర్టును ఆశ్రయించడంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది. గ్రంధి యానాదిశెట్టిని వైకాపా నాయకులు మోసం చేశారని టిడిపిలో చేరగా, యానాదిశెట్టి వైకాపాను మోసం చేశారని జగదీష్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. అప్పటి నుండి మున్సిపాలిటీలో పరిణామాలు ప్రజలకు విదితమే. ఇదిలా ఉండగా ప్రస్తుతం భరత్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించేందుకు అవకాశం ఉన్నా ఆ ప్రయత్నాలు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముఖ్యంగా మున్సిపాలిటీలో 40మంది కౌన్సిలర్లకు గాను 23మంది మహిళలు కౌన్సిలర్లుగా గెలుపొందడం విశేషం. వార్డుల్లో అభివృద్ధిలో మహిళలు వెనుకబడిపోవడం, వారి భర్తల పెత్తనం కొనసాగడం, అధికారులు సహకరించకపోవడం వంటి కారణాలు ఒకవైతే, మున్సిపాలిటీలో చిరు ఉద్యోగులు సైతం తమకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని మహిళా కౌన్సిలర్ల భర్తలు నాయకుల వద్ద వాపోయినట్లు సమాచారం.

- **చేతివాటం ప్రదర్శిస్తున్న అధికారులు**
- **ప్రజలకు తప్పని కష్టాలు**





## కావలి కబుర్లు

మొత్తానికి మున్సిపాలిటీ పరిస్థితి అగమ్యగోచరంగా మారి వార్డుల్లో ఎటుచూసినా పందులు, కుక్కలు, చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయి. ఆ ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. పన్నులు మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు సౌకర్యాలు కల్పించడంలో కుంటిసాకులు చెబుతున్నారు. ఇటీవల పట్టణంలో 20వార్డులకు నగరదీపికలను నియమించారు. మిగిలిన 20వార్డుల్లో నియామకాలు జరపలేదు. నియామకాలు జరపనివన్నీ మురికివాడలే.

**నీటి సరఫరా:** పేదోళ్లు ఏర్పాటు చేసుకున్న వీధి కుళాయిలను తొలగించి వారిపై ప్రతాపం చూపే అధికారులు, పట్టణంలోని అనధికార కుళాయిలపై మమకారం చూపిస్తున్నారు. పట్టణంలో అధికారికంగా ఉపయోగించే కుళాయిలు 3,750కాగా, 16,750ఇళ్ళ నుండి నీటి పన్ను వసూలు చేస్తున్నారు. మరి ఈ డబ్బు అంతా ఏమౌతుందో బహిరంగ రహస్యమే. అధికారులు దాడులు నిర్వహించి వీరిపై చర్యలు తీసుకోకుండా మామూళ్ళను వసూలు చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుత రాజకీయ పరిణామాలతో మున్సిపల్ అధికారులు మరింత చేతివాటం చూపిస్తున్నారు.

**అనుమతులు లేని కట్టడాలు:** పట్టణంలో పురపాలక సంఘం నుండి అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలను చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా పురపాలక పట్టణ, గ్రామీణ ప్రణాళికాధికారి కె.ఎం.దొర గతంలో పేర్కొన్నా స్థానిక అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**తాగునీటికి ప్రాదాన్యం:** ఫిబ్రవరి 28వ తేదీన ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు సూచించారు. తాగునీటికి 1.20కోట్లు కేటాయించగా, వీధి దీపాలకు 6.71లక్షలు, పారిశుద్ధ్యానికి 99వేల వంతున మొత్తం 1,27,52,000రూపాయల నిధులు ఆమోదింపజేశారు. అయితే పట్టణంలో మాత్రం తాగునీటి సమస్య పూర్తిస్థాయిలో తీరకపోగా వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులు కూడా అరకొరగానే మిగిలాయి.

**వనరులు:** కావలి పురపాలకానికి అనేక ప్రాంతాల్లో ఆదాయ వనరులున్నా మున్సిపల్ అధికారులకు అడుగు ముందుకు పడదు. కారణం కొందరు ప్రజాప్రతినిధులు, మాజీలు విలువైన పురపాలక స్థలాలను ఆక్రమించి అందులో అంగళ్ళను ఏర్పాటు చేయించారు. అధికారులు వీటిపై నిర్దిష్టంగా వ్యవహరించి వారిపై చర్యలు తీసుకుని పురపాలక ఆదాయాన్ని పెంచుకోవచ్చు. కాని వారిపై కన్నెత్తి చూడకపోవడం తెలిసిందే! రోజు రోజుకు దిగజారిపోతున్న కావలి మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి పెట్టి కొత్త కమిషనర్‌ను త్వరితగతిన నియమించి పురప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, పట్టణంలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మునిసిపల్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



కావలి మునిసిపల్ డి.ఇ, ఇన్‌ఛార్జ్ కమిషనర్ శ్రీనివాసరావు తమ కార్యాలయంలో జరిగే పనుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలంటూ స్థానిక శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం డి.ఇని తన కార్యాలయానికి పిలుచుకుని, మునిసిపాల్టీలో జరిగే పనులపై ఆయన ఆరా తీస్తుండగా, అదే సమయంలో పక్కనున్న ఓ వ్యక్తి వీడియో తీస్తుండగా, డి.ఇ అతనిని ఎందుకు వీడియో తీస్తున్నావని ప్రశ్నించారు. వెంటనే ఎమ్మెల్యే కలుగజేసుకుని, మీరు ఇచ్చే సమాచారం మాకు ఆధారంగా వుంటుందని చెప్పగా, డి.ఇ అక్కడనుంచి లేచి తమ కార్యాలయానికి వచ్చేశారు. తాము అడిగిన సమాచారం ఇవ్వలేదంటూ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆయనతో పాటు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి వెంకటనారాయణ, చేవూరి తిరుపాలు, మదన్‌మోహన్ రెడ్డి తదితరులు మునిసిపల్ కార్యాలయానికి వెళ్ళి, అడిగిన సమాచారం ఎందుకు చెప్పడం లేదంటూ డి.ఇని నిలదీశారు. డి.ఇ మాట్లాడుతూ, ఎమ్మెల్యే కనుక మీకు సమాధానం చెపుతాను కానీ, అందరికీ సమాధానం చెప్పను అనడంతో గొడవ చెలరేగింది. పక్కనే వున్న వైస్‌ఛైర్మెన్ భరత్‌కుమార్ మాట్లాడుతూ, అధికారులను బెదిరించడం నాయకులకు మంచి లక్షణం కాదన్నారు. నెమ్మదిగా మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఫ్లోర్‌లీడర్ కనుమర్లపూడి వెంకటనారాయణ మాట్లాడుతూ నాకెందుకు సమాధానం చెప్పవని నిలదీయడంతో వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఎట్టకేలకు పోలీసులు రంగప్రవేశం చేసి, ఇరువురికీ సర్ది చెప్పి ప్రశాంత వాతావరణం కల్పించారు. ఇంతలో టిడిపి నాయకులు, కౌన్సిలర్లు అక్కడకు చేరుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా వుంటే ఇన్‌ఛార్జి కమిషనర్‌గా పనిచేస్తున్న డి.ఇ ఒక పార్టీకి కొమ్ముకాస్తూ, వారి వార్డులకు మాత్రమే నీటిని సరఫరా చేయడం, వారికే అభివృద్ధి పనులు చేయడం దారుణమని, ఈ అన్యాయాన్ని చూస్తూ సహించలేమని హెచ్చరించారు. వైస్‌ఛైర్మెన్ భరత్‌కుమార్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏకపక్షంగా వ్యవహరించింది మీరు కాదా అని ప్రశ్నించారు. పట్టణాన్ని అభివృద్ధి చేసేది అధికారులను బెదిరించి కాదని, నిజంగా మీరు బాగు చేయాలనుకుంటే, రండి..కూర్చుని చర్చించండి, ప్రజలకు ఏది అవసరమో అది చేద్దాం.. అన్నారు. పట్టణ అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడేది మీరుకాదా అని అన్నారు. ఛైర్‌పర్సన్ అలేఖ్యను రాజకీయంగా మోసం చేసింది మీరేనని, వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలన్నారు.



# కుటుంబ వ్యవస్థపై చర్చా వేదిక

సమాజంలో ప్రస్తుతం కొనసాగుతున్న పురుషాధిక్య ధోరణిని మానుకోవాలని, కుటుంబంలో భార్యా భర్తలిద్దరూ ఒకరికొకరు పరస్పరం సహకరించుకోవాలని అశ్లీల ప్రతిఘటన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సి.శారద సూచించారు. ఇటీవల జనతాపేట ఉత్తరంలోగల మైత్రి మహిళా బ్యాంకు ఆవరణంలో ప్రపంచ కుటుంబ దినోత్సవం సందర్భంగా 'కుటుంబ వ్యవస్థ నాడు – నేడు' అనే అంశంపై చర్చా వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మైత్రి మహిళాబ్యాంకు అధ్యక్షురాలు కె.రమాదేవి, ఎస్సీ ఎస్టీ ఛైల్డ్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గగన్‌కుమారిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుషాధిక్యత, వ్యసనాలు, కట్నం, గృహహింసలు పెరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణి, శ్రీదేవి, నూర్జహాన్, రవికుమార్, పద్మావతి, తిరుమల పాల్గొన్నారు.

# త్యాగపురుషుడు పుచ్చలపల్లి



త్యాగ పురుషుడు, భూపోరాటానికి నాంది పలికిన కమ్యూనిష్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం నాయకులు తాళ్ళూరు మాల్యాద్రి అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద ఆయన 30వ వర్ధంతిని నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక పేద ప్రజలకు మంచినీళ్ళు, మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిష్టు రథసారధి సుందరయ్య అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో తామంతా నడుస్తూ ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, సిఐటియు నాయకులు రామయ్య, మల్లిఖార్జునరావు, సుబ్బరామశర్మ తదితరులు పాల్గొన్నారు.

# తల్లికి భారమౌతున్న ఆడబిడ్డలు



పుట్టిన ఆడబిడ్డలను పురిటిలోనే చంపుతున్న ఆ తల్లులకు ఏమి కష్టమొచ్చిందో, ఎంత కష్టమొచ్చిందో... ఆ భగవంతునికే తెలియాలి. మంగళవారం పట్టణంలోని పూలబజారు వద్ద గల మురికికాలువలో అప్పుడే పుట్టిన ఆడబిడ్డను నిర్ధాక్షిణ్యంగా పడవేయడం స్థానికంగా సంచలనం రేపింది. ఈ విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు తండోపతండాలుగా అక్కడకు చేరుకుని పసి బిడ్డను కాలువలో పడవేసిన వైనాన్ని చూసి తల్లడిల్లిపోయారు. ఇటీవల పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌లో 3నెలల ఆడ బిడ్డను అర్ధరాత్రి ఒక సంచిలో ఉంచి వదలివెళ్లిన సంఘటన మరువకముందే పట్టణంలో ఈ సంఘటన జరగడంతో చర్చనీయాంశంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్ల సంరక్షణకు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నా తరచూ ఇలాంటి సంఘటనలు జరగడానికి గల కారణాలను అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

# కల్యాణ వైభవం...!



## కమలేష్ - శావ్య

ప్రముఖ వ్యాపారవేత్త, స్నేహశీలి నెల్లూరులో సీజన్స్‌ఇన్ హోటల్‌తో పాటు కోవూరు సమీపంలో అనపల్లి కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించిన కోవూరు వాసి అనపల్లి అశోక్‌రెడ్డి - శ్రీమతి సులోచన గారల రెండవ కుమారుడు కమలేష్ కల్యాణం మే 20వ తేదీ ఉదయం శ్రీమతి ఉమామహేశ్వరి - కొండ్రెడ్డి విజయకుమార్‌రెడ్డిల కుమార్తె శావ్యతో అనపల్లి కన్వెన్షన్ సెంటర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. కోవూరుతో పాటు చెన్నై, హైదరాబాదు, బెంగుళూరు వంటి నగరాలలో అధికార వర్గాలతో పాటు పారిశ్రామిక, రాజకీయ రంగాలలోని ప్రముఖులతో అశోక్‌రెడ్డికి మంచి స్నేహ సంబంధాలు వుండడంతో అధిక సంఖ్యలో ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

20వ తేదీ సాయంత్రం ఇదే ప్రాంగణంలో జరిగిన రిసెప్షన్ సంబరంలో కూడా పలువురు రాజకీయ నాయకులతో పాటు ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు పాల్గొని **కమలేష్-శావ్య**లను దీవించారు. రెండు వేడుకలలో పాల్గొన్న అతిథులకు అశోక్‌రెడ్డితో పాటు ఆయన పెద్దకుమారుడు రమేష్ సాదరంగా స్వాగతం పలికి ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించారు. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.













# 10లో నెల్లూరుకు 12వ స్థానం

10వ తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం సాయంత్రం విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు విశాఖలో ఈ ఫలితాలను విడుదల చేశారు. ఉత్తీర్ణతలో కడప జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలువగా, మన నెల్లూరుజిల్లా మాత్రం 12వ స్థానంతో సరిపెట్టుకుంది. జిల్లాలో ప్రభుత్వ విద్యావ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉందో ఈ ఫలితాలను బట్టే వెల్లడవుతుంది. మన జిల్లా నుండి మొత్తం 34,419మంది పరీక్షలు వ్రాయగా 31,078 ఉత్తీర్ణులయ్యారు.

**'వేదవ్యాస' ప్రతిభ :** ఎస్ఎస్‌సి ఫలితాల్లో నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో వున్న వేదవ్యాస పబ్లిక్ స్కూల్ తన ప్రతిభను నిరూపించుకుంది. ఈ స్కూల్ విద్యార్థినులు బి.సుమ, కె.మనోజ్ఞసుందరిలకు జిపిఎ 10/10 సాధించడంతో ఆ స్కూల్ నిర్వాహకులు వారిని అభినందించారు. ఈ స్కూల్‌లో మొత్తం విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారని, నూటికి నూరుశాతం ఫలితాలు సాధించారని, మొత్తం 44 మంది విద్యార్థుల్లో సగం మంది విద్యార్థులు ఏ-గ్రేడ్ సాధించారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్నీ స్కూల్ నిర్వాహకులు అభినందించారు.

**సత్తా చాటిన 'మైథిలి' స్కూల్ :** టెన్త్ ఫలితాల్లో నెల్లూరులోని మైథిలి స్కూల్ తన సత్తా చాటింది. ఈ స్కూల్ విద్యార్థి భానుతేజ 10 పాయింట్లు, రాజేశ్వరి తన్మయి, దీక్షిత, శివాని 9.8 పాయింట్లు సాధించారని, మొత్తం 43 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరవగా, 43 మంది ఉత్తీర్ణులయ్యారని, నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని స్కూల్ కరస్పాండెంట్ మైథిలి మనోహర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేవారు. అన్ని సబ్జెక్టులలో 42 మంది ఏ-గ్రేడ్ సాధించారని ఆయన పేర్కొంటూ, ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

**మోడరన్ నూరుశాతం ఫలితాలు:** నెల్లూరు సరస్వతినగర్‌లోని మోడరన్ స్కూల్ పాత సంప్రదాయాన్నే కొనసాగించింది. ఈ యేడాది కూడా నూరు శాతం ఫలితాలు సాధించింది. 42మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 26మందికి ఏ1 గ్రేడ్, 9మందికి ఏ2గ్రేడ్‌లు లభించాయి. జోషిత 10కి 10పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే తెలుగులో 14మంది, హిందీలో 23మంది, ఇంగ్లీషులో 12మంది, గణితంలో 25మంది, సైన్స్‌లో 10మంది, సోషల్ 20మంది 10కి 10పాయింట్లు సాధించి తమ విద్యా సంస్థ కీర్తిప్రతిష్టలను పెంచారు.

**నేతాజీ పైలట్ ఫలితాలలో హైలెట్:** విజయమహల్‌గేట్ సెంటర్‌లోని శ్రీ నేతాజీ ఎంఎస్ఆర్ పైలెట్ హైస్కూల్ విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించారు. ఈ స్కూలుకు చెందిన డి.సందీప్, కె.సాయిశ్రావణ్‌రెడ్డి, పి.చక్రవర్తి, షేక్ అఖిల్, కె.భానుతేజశ్రీ, ఎన్.బాదుల్లా, పి.అర్చనలు 10పాయింట్లకు గాను 9.8పాయింట్లు సాధించారు. 9మంది 9.7పాయింట్లు, 11మంది 9.6పాయింట్లు, 10మంది 9.3పాయింట్లు, 5మంది 9.2పాయింట్లు సాధించారు. విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి అభినందించారు.

**ఎప్పటిలాగే ఎస్ఆర్‌కె:** నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని ఎస్ఆర్‌కె స్కూల్ విద్యార్థులు ఎప్పటిలాగే 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను చూపారు. ఈ స్కూలుకు చెందిన కాశ్యప్, విష్ణు కమాలీలు 10కి 10పాయింట్లు సాధించారు. అలాగే ఆరు మంది విద్యార్థులు 9.8పాయింట్లు, 71మంది 9పాయింట్లు, 133మంది 8పాయింట్లు సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ పి.కృష్ణమూర్తి, డైరెక్టర్ దిలీప్‌లు అభినందించారు.

# "నాటా" కేంద్ర కార్యాలయం ప్రారంభం!

(5వ పేజీ తరువాయి)

ప్రారంభోత్సవ విందులో పాల్గొన్నారు. ప్రస్తుత నాటా అధ్యక్షుడు డా॥ మోహన్ మల్లాం, పూర్వ అధ్యక్షులు ఎ.వి.యన్.రెడ్డి, సంజీవరెడ్డి, రమేష్ అప్పారెడ్డి, కాబోయే అధ్యక్షుడు గంగసాని రాజేశ్వరరెడ్డి, కాబోయే ఉపాధ్యక్షుడు డా॥ గోశాల రాఘవరెడ్డి, కార్యదర్శి గిరీష్‌రామిరెడ్డి, కోశాధికారి హరి వెల్కూర్, సహకార్యదర్శి శ్రీనివాస్ గనగోని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆళ్ళ రామిరెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అన్నారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పెనుమాడ, డా॥ స్టాన్లీరెడ్డి, శివ మేక, మురారి వెంకటరమణారెడ్డి, ప్రదీప్ సామల పాల్గొన్న ఈ కార్యక్రమానికి న్యూజెర్సీ స్థానిక ఉపాధ్యక్షులు వారణాసి ద్వారక్, మండపాటి శరత్‌లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నాటా టీమ్ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపింది. ఆల్ ది బెస్ట్ టూ నాటా!

# సమర్థతకు స్థానం

(మొదటిపేజీ తరువాయి)

వరించడానికి ఎన్నో అంశాలు దోహదపడ్డాయి. రాజకీయాలలో సీనియారిటీతో పాటు పార్టీ పట్ల సిన్సియారిటీ, ప్రతిపక్ష నేత జగన్‌పై దూకుడుగా విమర్శలు చేయడం, జిల్లాలో పార్టీని ముందుకు తీసుకెళ్లగల సమర్థుడు కావడం, అన్నింటికి మించి 'రెడ్డి' సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి రావడం వంటివన్నీ కూడా సోమిరెడ్డికి కలిసొచ్చాయి. ముఖ్యంగా ఇటీవలే జరిగిన నాలుగు ఎమ్మెల్సీల భర్తీలో జిల్లా నుండి బీద రవిచంద్రకు రాకపోవడం కూడా సోమిరెడ్డికి కలిసొచ్చిందనే చెప్పవచ్చు.

తెలుగుదేశంపార్టీలో సోమిరెడ్డి సీనియార్టీని ఈ ఎమ్మెల్సీ ద్వారా గౌరవించినట్లయ్యింది. జిల్లాలో తెలుగుదేశంపార్టీ బలోపేతానికి సోమిరెడ్డి ఎంతగానో కృషి చేసారు. 1992లో సారా వ్యతిరేకోద్యమం మొదలుకొని పార్టీ తరపున ఎన్నో పోరాటాలు చేసాడు. 1994, 1999లలో సర్వేపల్లి నుండి గెలిచిన సోమిరెడ్డి 2004, 2009, 2014ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుండి ఓడిపోయాడు. మధ్యలో 2012లో కోవూరు ఉపఎన్నికల్లోనూ పోటీచేసి వై.యస్. సానుభూతి గాలిలో ఓడిపోయాడు. 2006లో జిల్లా పరిషత్ ఛైర్మెన్ అభ్యర్థిగా నిలిచి పెళ్లకూరు జడ్పీటీసీ నుండి పోటీ చేసి గెలిచాడు. జడ్పీ ఛైర్మెన్ కాలేక చాలాకాలం జడ్పీటీసీగానే ఉండిపోయాడు. ముఖ్యంగా పార్టీ ప్రతిపక్షంలో ఉన్న 2004-2014మధ్యకాలంలో సోమిరెడ్డి పార్టీ కోసం గట్టిగా నిలబడ్డాడు. ఆర్థికంగా కూడా దెబ్బతిన్నాడు. ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నా, తెలుగుదేశం పని ఇక అయిపోయిందనుకుని ఎందరు పార్టీని వదిలి వెళ్లినా సోమిరెడ్డి మాత్రం పార్టీని వీడలేదు. సుదీర్ఘ కాలం పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పనిచేసి కేడర్‌ను ఏకతాటిపై నడిపించాడు.

2014లో పార్టీ అధికారంలోకి వచ్చినా సర్వేపల్లి నుండి సోమిరెడ్డి ఓడిపోయాడు. జిల్లాకు చెందిన నారాయణకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేసారు. నారాయణ మంత్రి కావడం వల్ల జిల్లాకు ఒరిగిందేమీ లేదు. ఆయన మంత్రిగా కంటే నూతన రాజధాని కన్సల్టెంట్‌గానే ఎక్కువ సేవలందిస్తున్నాడు. జిల్లాలో ప్రజలకే కాదు కనీసం తెలుగుదేశంపార్టీ కార్యకర్తలకు కూడా అందుబాటులో ఉండేవాడు కాదు. ఏ పదవీ లేకపోయినా సోమిరెడ్డే ఆరోజు నుండి ఈరోజుదాకా జనానికి అందుబాటులో ఉంటున్నాడు. ఏ పదవీ లేకముందే సోమిరెడ్డి ఆఫీసు ముందు రోజూ జనం జాతర మాదిరిగా ఉండేవాళ్లు. ఎమ్మెల్సీ వచ్చింది కదా... రేపట్నుండి ఈ జనం రెట్టింపయ్యే అవకాశముంది. సోమిరెడ్డికి ఎమ్మెల్సీ రావడం పట్ల జిల్లాలో కార్యకర్తలకు న్యాయం జరిగిందని ఆ పార్టీ వాళ్లే వ్యాఖ్యానిస్తుండడం విశేషం.

# సోలార్ పంపుసెట్లు ప్రారంభించిన బి.యం.ఆర్



ఈ నెల 21న కావలి మండలం చలంచర్ల గ్రామంలో కావలి మాజీశాసనసభ్యుడు, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు సోలార్ మోటార్ పంపుసెట్లను ప్రారంభించారు. కరెంటు కోసం ఎదురుచూడకుండా సోలార్ మోటార్ల ద్వారా రైతులు బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చాడు.



# శ్రీరస్తు... శుభమస్తు... వైభోగమస్తు...!

మా రెండవ అబ్బాయి

**కమలేష్**

శ్రీమతి ఉమామహేశ్వరి - కొండ్రెడ్డి విజయకుమార్‌రెడ్డి గార్ల అమ్మాయి

**శావ్య**

ముచ్చటగా చేయి చేయి కలిపి.. ఏడడుగులు కలసి నడచి

దంపతులైన శుభవేళ

తరలివచ్చి దీవించిన బంధువులకు, మిత్రులకు,

ఆప్తులకు, ఆత్మీయులకు, శ్రేయోభిలాషులకు

**మా ధన్యవాదాలు.**



**అనపల్లి అశోక్‌రెడ్డి**
**శ్రీమతి సులోచన**

**అనపల్లి రమేష్‌రెడ్డి**
**శ్రీమతి దీప్తి**
**రిత్విక్**

కోవూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com